హెల్మెట్ లేకుంటే ప్రాణాపాయమే

ఆరు నెలల్లో 51మంది మృత్యువాత

## ముప్పు అని తెలిసినా

# తలకెక్కడం లేదు



చిత్తూరు గాంధీ సర్కిల్ వద్ద యువకుల నిర్లక్ష్యపు డ్రైవింగ్

ద్విచక్ర వాహనదారుల నిర్లక్ష్యం.. అతివేగం.. రోడ్డు ప్రమాదాలకు ఎక్కువగా కారణమవుతున్నాయి. వందలాది మంది అసువులు బాస్తున్నారు. మృతుల సంఖ్య పెరగడానికి హెల్మెట్ ధరించకపోవడం ప్రధాన కారణంగా పోలీసు లెక్కలు చెబుతున్నాయి.90శాతానికి పైగా హెల్మెట్ ధరించడం లేదు.ద్విచక్ర వాహనాలను రూ.లక్షలు పెట్టి కొనుగోలు చేసేవారు, రూ.వెయ్యి లోపు ఖర్చయ్యే హెల్మెట్లను కొనుగోలు చేసేందుకు మాత్రం వెనకాడుతుంటారు. ఒకవేళ కొనుగోలు చేసినా ధరించడం లేదు. వారంతా హెల్మెట్ ధరించేలా అవగాహన కల్పించడంలో రవాణా,పోలీసు అధికారులు విఫలమయ్యారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

● చిత్తూరు నగరం గోకులంవీధికి చెందిన శ్రీహరి, వినీత దంపతుల ఒక్కగానొక్క కుమారుడు రాహుల్ సీతమ్స్ కాలేజీలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదివేవాడు. తల్లిదండ్రులు గారాబంతో రూ.3.20 లక్షలు విలువ చేసే బైక్‌ను 2022 జూన్ 1వ తేదీన కొనిచ్చారు. పది రోజులకే కాలేజీ నుంచి వెనుక స్నేహితుడ్ని కూర్చొబెట్టుకుని రాహుల్ బైక్‌పై బయల్దేరాడు. కాలేజీ నుంచి మురకంబట్టు వైపు ప్రయాణిస్తుండగా.. రోడ్డుపైనున్న ఇసుకలో బైక్ స్కిడ్ కావడంతో ప్రమాదం జరిగింది. ఇద్దరూ రోడ్డు పక్కనున్న రాళ్ల మీద పడడంతో తలకు గాయాలై అక్కడికక్కడే మరణించారు. హెల్మెట్లు ధరించి ఉంటే బతికేవారు.

● గతేడాది సెప్టెంబరు 10వ తేదీన.. కార్వేటినగరం కొల్లాగుంట కొత్త దళితవాడకు చెందిన కె.రాజా (50) తన పొలానికి నీరు పారించేందుకు బయల్దేరాడు. పళ్లిపట్టు నుంచి వెళ్తున్న కారు పడివేటమ్మ ఆలయం వద్ద రాజా ప్రయాణిస్తున్న స్కూటర్‌ను ఢీకొంది. రాజా తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందారు. హెల్మెట్ ఉంటే ప్రాణాలు దక్కేవి.

●కాళ్లు, చేతులు, ఇతర శరీర భాగాలు గాయపడినా బతకవచ్చు, కానీ తలకు గాయమైతే ప్రాణానికి ముప్పు తప్పదు. ద్విచక్ర వాహనాలను నడపడంలో తాము నేర్పరులమని, హెల్మెట్లు అవసరం లేదని కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటారు. మరికొందరు దాన్ని అడ్డంకిగా భావిస్తుంటారు. మొత్తమ్మీద హెల్మెట్లను ధరించాలంటే ఎక్కువమంది ఆసక్తి చూపడం లేదు. దీంతో ప్రమాదాలు జరిగినప్పుడు నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి.

● పట్టణాల్లో ఇబ్బందులు..

అప్పుడప్పుడూ పోలీసులు నగరాలు, పట్టణ ప్రాంతాల్లోని ప్రధాన సర్కిళ్లలో తనిఖీలు చేస్తుంటారు. వాస్తవానికి పట్టణాల్లో ద్విచక్ర వాహనాలు వేగంగా వెళ్లే అవకాశం ఉండదు. హైవేల్లో మాత్రం శృతిమించిన వేగంతో ప్రయాణిస్తుంటారు, ప్రమాదాలు జరిగితే ప్రాణాలు కోల్పోతుంటారు. జిల్లాలో హెల్మెట్ లేక మరణించిన ఘటనలన్నీ హైవేల్లో చోటు చేసుకున్నవే.

యువకులు మరీ నిర్లక్ష్యంగా బైక్ రైడింగు చేస్తున్నారు. సైలెన్సర్లను తొలగించి పెద్ద శబ్దాలతో డ్రైవ్ చేస్తుంటారు. మరికొందరు సెల్‌ఫోన్లో మాట్లాడుతూ మెడ ఒక వైపు వంచుకుని డ్రైవ్ చేస్తుంటారు. అలా చేయడంతో వారితో పాటు పక్కన ప్రయాణించేవారికీ ఇబ్బందులు తప్పడం లేదు.


### డ్రంక్ అండ్ డ్రైవ్ పైనే దృష్టి

చిత్తూరులో ట్రాఫిక్ పోలీసులు సీఐ నిత్యబాబు ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను నిత్యం నిర్వహిస్తున్నారు. రూ.10 వేల చొప్పున జరిమానా విధించి, కేసులు పెడుతున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా, హెల్మెట్ల విషయంలో దృష్టి పెట్టడం లేదనే విమర్శలు వస్తున్నాయి. నగరంలో ప్రధాన కూడళ్లలో కాకుండా నగర బయటి ప్రాంతాల్లో తనిఖీలు పెంచాల్సిన అవసరముంది.


● జిల్లాలో హెల్మెట్లు ధరించక మరణించినవారి వివరాలు

| నెల | మృతులు |
|---|---|
| జూన్ | 7 |
| జూలై | 9 |
| ఆగస్టు | 9 |
| సెప్టెంబరు | 13 |
| అక్టోబరు | 5 |
| నవంబరు | 7 |
| డిసెంబరు 15వరకూ | 1 |
| మొత్తం | 51 |


హెల్మెట్ లేకుండా రయ్ మంటూ వెళ్తున్న పోలీసు


హెల్మెట్.. స్కూటర్‌కు కాదు సార్, మనం ధరించాలి

## వైష్ణవాలయాల్లో తిరుప్పావై పారాయణం


కోదండరామాలయంలో తిరుప్పావై పారాయణం

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):పవిత్రమైన . ధనుర్మాస ఘడియలు సోమవారం ఉదయం 6.57 గంటలకు ప్రారంభమయ్యాయి.ఈ సందర్భంగా చిత్తూరు నగరంలోని వైష్ణవాలయాల్లో వేంకటేశ్వరస్వామి భక్తురాలు గోదాదేవి (ఆండాళ్) రచించిన 30 పాశురాల తిరుప్పావై పారాయణాన్ని ప్రారంభించారు.చిత్తూరు కోదండరామాలయంలో అర్చకుడు వేణుగోపాల్ బృందం పారాయణం చేశారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి.. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అలాగే మహాలక్ష్మి గోదాదేవి ఆంజనేయ సమేత వేంకటేశ్వరాలయంలో అర్చకుడు తులసీరాం బృందం, పొన్నియమ్మ గుడి వీధి వీరాంజనేయ ఆలయంలో అర్చకుడు సుధాకర్ గురుకల్, గిరింపేట ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో అర్చకుడు కిషోర్, కట్టమంచి వరదరాజ స్వామి ఆలయంలో అర్చకుడు నారాయణ దీక్షితులు తిరుప్పావై పాశురాలను పారాయణం చేశారు. జనవరి 14వ తేదీవరకు రోజుకో పాశురం చొప్పున తిరుప్పావై పారాయణం జరగనుంది.



## ఇళ్ల ముందు గొబ్బెమ్మలు

పాలసముద్రం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం (పండగ నెల) సోమవారం ప్రారంభమవడంతో మహిళలు తమ ఇళ్ల ముందు రంగవల్లులు వేసి.. గొబ్బెమ్మలు పెట్టి దీపాలు వెలిగించి, పూజలు నిర్వహించారు.ఈ నెలంతా గ్రామాల్లో పండుగ వాతావరణం కనిపిస్తుంది.

## రెవెన్యూ సదస్సుల్లో 49 సేవల ఉచితం

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు ఇచ్చే వినతులకు 49 రకాల సేవలు ఉచితంగా అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటన్నిటికీ యూజర్ చార్జీలను మినహాయిస్తూ ఆదేశాలు జారీచేసింది.

● రెవెన్యూశాఖ ద్వారా..

కంప్యూటర్ అడంగళ్ సర్వే, ఎల్పీ నెంబరు, డూప్లికెట్ ఈబీసీ, సమీకృత, ఓబీసీ ధ్రువపత్రాలను రుసుం లేకుండా ఇస్తారు. అలాగే పట్టాదారు పాసుపుస్తకం కమ్ టైటిల్ డీడ్, రెండోసారి జారీచేసే ఆదాయ, ఇంటిగ్రేటెడ్ ధ్రువపత్రాలు, ఆర్వోఆర్, 1బీ, నీటిపన్ను, వ్యవసాయ భూమి విలువ, పేరు మార్పు, ఏపీ చుక్కల భూముల చట్టం కింద క్లెయిమ్‌లు, పాత ఈ-పాస్ బుక్ స్థానంలో కొత్తది, డి-పట్టా, ఇంటి స్థలం పట్టా, కుటుంబ సభ్యుడి ధ్రువపత్రం, ఆదాయ, ఈడబ్ల్యూఎస్ వర్గాలవారికి జారీ చేసే ఆదాయ, ఆస్తి పత్రం, ఇనామ్ భూములపై ఆక్యుపెన్సీ హక్కు, చిన్న, సన్నకారు రైతుగా నిర్ధారణ, జీవో నెం. 225 ప్రకారం భూకేటాయింపు, ఆలస్యంగా జనన, మరణ ధ్రువపత్రాల నమోదు, మాన్యువల్ అడంగళ్, పట్టాదారు ఆధార్ సీడింగ్ ఎల్‌పీ నెంబర్, సెల్‌ఫోన్ నెంబర్ - పట్టాదార్ ఆధార్ సీడింగ్, 22ఏ- 1ఏ-1బీ-1 డీ-1ఇలో మార్పులు-చేర్పులు, మ్యూటేషన్‌కు సంబంధించి తప్పొప్పుల సవరణ, నో ఎర్నింగ్, నో ప్రాపర్టీ, పొజిషన్, స్థానికత, రీసెటిల్‌మెంట్ రిజిస్టర్, టైటిల్ డీడ్ కమ్ పాస్‌బుక్ తదితర సేవలు అందిస్తారు. వీటితోపాటు సర్వేశాఖ నుంచి కూడా కొన్ని సేవలు అందివ్వాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది.

## భక్తుడి పట్ల దురుసు ప్రవర్తన

కాణిపాక ఆలయ ఉద్యోగిపై మంత్రి లోకేశ్‌కు ఎక్స్‌లో ఫిర్యాదు

విచారించి తొలగించిన ఈవో

ఐరాల (కాణిపాకం), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): 'కాణిపాక ఆలయంలో దారుణంగా దోపిడీ చేస్తున్నారు. 500రూపాయలతో సాధారణ ఆశీర్వాద టికెట్ తీసుకున్నాం. దానిపై ఇద్దరికి అనుమతి అని రాసి ఉంది. కానీ అక్కడి సిబ్బంది ఒకరినే లోపలికి పంపించారు. అడిగితే ఇక్కడ రూల్స్ అంతే. ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో అన్నాడు. భక్తులకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలి' అని కిశోర్ గౌడ్ అనే భక్తుడు ఎక్స్(ఒకప్పటి ట్విట్టర్)లో ఈ నెల 14వ తేదీన ట్వీట్ చేశాడు. మంత్రి నారా లోకేశ్‌కు ట్యాగ్ కూడా చేశాడు. ఈ అంశంపై లోకేశ్ ఒక రోజు వ్యవధిలో అంటే ఆదివారం స్పందించారు. నిష్పక్షపాతంగా విచారించి చర్యలు తీసుకుంటామని ఎక్స్‌లో రీపోస్టు పెట్టారు. ఇదిలా ఉండగా భక్తుడి పట్ల దురుసుగా ప్రవర్తించిన డైలీవేజెస్ ఉద్యోగి కుట్టిబాబును విధుల నుంచి నిలిపి వేస్తున్నామని ఈవో కిశోర్ సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రకటనను 'ఆఫీస్ ఆఫ్ నారా లోకేశ్' ఎక్స్ అకౌంట్‌లో సోమవారం పోస్టు చేశారు. వివరాల్లోకి వెళితే..కిశోర్ గౌడ్ అనే భక్తుడు ఆలయ టికెట్ కౌంటర్ వద్ద రూ.500 సాధారణ ఆశీర్వాద టికెట్టును కొనుగోలు చేశారు. ఈ టికెట్టుతో తమను దర్శనానికి అనుమతించాలని ఆలయ ఉద్యోగిని కోరారు. దీంతో ఒకరిని మాత్రమే స్వామి దర్శనానికి అనుమతిస్తానని కుట్టిబాబు దురుసుగా సమాధానం చెప్పాడు. దీంతో ఆగ్రహించిన సదరు భక్తుడు ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదు చేశారు.ఆయన వెంటనే దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డితో మాటాడి విచారణకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఈవో కిషోర్ ఈ విషయాన్ని క్షుణ్ణంగా ఆరా తీసి కౌంటర్‌లో విధులు నిర్వహిస్తున్న కుట్టిబాబును తాత్కాలికంగా విధుల నుంచి తొలగించారు. ఈ విషయంపై పూర్తి స్థాయిలో విచారించనున్నట్లు ఈవో కిషోర్ వివరించారు. ఈ నేపథ్యంలో ఆలయ ఉద్యోగులు,సిబ్బందితో సోమవారం ఈవో సమావేశమయ్యారు.భక్తులతో మర్యాదగా నడుచుకోవాలని,గౌరవంగా సంబోధించాలని సూచించారు. ఎక్కడ ఎవరు తప్పు చేసినా ఆలయ ప్రతిష్ఠ దెబ్బతింటుందని కాబట్టి ప్రతి ఒక్కరూ ఆలయం పట్ల బాధ్యతగా ఉండాలన్నారు.

## సైబర్ మోసం

● రూ. 56 లక్షలు పోగొట్టుకున్న ఇన్సూరెన్స్ ఉద్యోగి

చిత్తూరు అర్బన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై పోలీసులు అవగాహన కల్పిస్తున్నా.. జనం మోసపోతూనే ఉన్నారు. తాజాగా సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కిన ఓ ప్రైవేటు ఉద్యోగి ఏకంగా రూ.56 లక్షలు పోగొట్టుకున్నాడు. చిత్తూరు నగరం రామ్‌నగర్‌కాలనీకి చెందిన చరణ్ తేజ(42) ఓ ఇన్సూరెన్స్ కంపెనీలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. ఈయనకు స్నేహితుడిగా ఉన్న ఓ బ్యాంకు మేనేజర్‌కు పరిచయం ఉన్న మరో వ్యక్తి ద్వారా మొదట స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెడితే రెండింతలు వస్తుందని నమ్మించారు. తదనంతరం బిట్‌కాయిన్స్‌లో పెట్టుబడి పెట్టాలని చెప్పి.. వేర్వేరు బ్యాంకు ఖాతాలకు డబ్బులను జమ చేయమని చెప్పారు. దాంతో చరణ్‌తేజ విడతల వారీగా రూ.56 లక్షలను డిపాజిట్ చేశాడు. ఆ తర్వాత వారి వద్ద నుంచి స్పందన రాకపోవడంతో సోమవారం రెండో పట్టణ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





హాజరైన ప్రజలు - సమావేశ వేదికపై అఖిలపక్ష నాయకులు, ప్రముఖులు

## చిత్తూరు అభివృద్ధికి హైరోడ్డు విస్తరణ తప్పనిసరి

● నష్టపోయే వారికి తగిన విధంగా న్యాయం చేస్తాం

● వివిధ వర్గాల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు అర్బన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగర అభివృద్ధిని కోరుకునేవారంతా రోడ్ల విస్తరణ, మౌలిక సదుపాయాల కల్పనతోనే ఆ అభివృద్ధి జరుగుతుందన్న విషయాన్ని గ్రహించాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ స్పష్టం చేశారు. చిత్తూరు నగరాన్ని స్మార్ట్‌గా అభివృద్ధి చేయడం, రోడ్ల విస్తరణ అంశాలపై సోమవారం సాయంత్రం నాగయ్య కళాక్షేత్రంలో ప్రజా సంఘాలు, నగర అభివృద్ధి కమిటీలు, ప్రజా ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నేతలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యువకులు, విద్యార్థులు మాట్లాడుతూ.. నగరాన్ని విద్యాపరంగా అభివృద్ధి చేయాలని కోరారు. యూనివర్శిటీని నెలకొల్పడం ద్వారా విద్యావకాశాలు మెరుగుపడతాయని సూచించారు. వైద్య రంగం, మౌలిక సదుపాయాల కల్పన, రహదారుల అభివృద్ధి, ఐటీ కంపెనీల ఏర్పాటు, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుపై వివిధ సంఘాల నేతలు, రాజకీయ నాయకులు తమ అభిప్రాయాలను తెలిపారు.సంతపేటవాసులు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే సత్యప్రభ బలవంతంగా మా ప్రాంత రోడ్లను విస్తరింపజేశారని గుర్తు చేసుకున్నారు. అప్పుడు తాము అడ్డుకున్నామని, అయితే రోడ్లను విస్తరించాక తమ ప్రాంతం బాగా అభివృద్ధి చెందిందన్నారు.తమ ఆస్తుల కూడా విలువ పెరిగిందన్నారు.తాము అప్పట్లో పరిహారం కూడా అడగలేదన్నారు.అనంతరం ఎమ్మెల్యే జగన్మోహన్ మాట్లాడుతూ.. 'చిత్తూరులో రోడ్ల విస్తరణ అంశం గత పదేళ్లుగా నానుతోంది. రోడ్లు అభివృద్ధి చెందితేనే నగరం అభివృద్ధి చెందుతుంది. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించి సహకరించాలి. ప్రధానంగా హైరోడ్డు విస్తరణ అంశంలో కొంతమంది అభివృద్ధికి అడ్డుపడుతున్నారు. అయినా ఈ విషయంలో వెనక్కు తగ్గే ప్రసక్తే లేదు. హైరోడ్డు విస్తరణకు అందరూ ఏకగ్రీవంగా తీర్మానం చేసి నాకు తెలియజేస్తే సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి నష్టపోయే వారికి తగిన విధంగా న్యాయం చేస్తాం. విస్తరణను అడ్డుకునే 200మంది వైపు కాకుండా, అభివృద్ధిని కాంక్షించే 2 లక్షల మంది వైపే నేనుంటాను.చెన్నై-బెంగళూరు నగరాల మధ్య ఉన్న చిత్తూరు అభివృద్ధి చెందడానికి అపారమైన అవకాశాలున్నాయి.అందరూ కలిసికట్టుగా నగరాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లడానికి ముందుకు రావాలి. మురకంబట్టు నుంచి కలెక్టరేట్ వరకు, ఇరువారం నుంచి పుత్తూరు రోడ్డు వరకు రోడ్లను విస్తరించుకోవడం ద్వారా నగరాన్ని వేగంగా అభివృద్ధి వైపు నడపగలం. నగరాభివృద్ధి కోసం స్మార్ట్ డెవలప్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేసి మూడు నెలలకు ఒకసారి సమావేశాన్ని ఏర్పాటు చేస్తాం. అభివృద్ధి కోసం కలిసి వచ్చే రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాలు, ట్రేడ్ యూనియన్లతో కలిసి ముందుకు సాగుతాం. అమరావతి స్ఫూర్తితోనే చిత్తూరు ప్రజలు నగరాభివృద్ధి కోసం స్వచ్ఛందంగా ముందుకురావాలి' అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్ రెడ్డి, చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్, ప్రముఖులు డీకే బద్రినారాయణ, రావూరి ఈశ్వరరావు, సురేంద్రకుమార్, చిట్టిబాబు, అట్లూరి శ్రీనివాసులు, సప్తగిరి ప్రసాద్, గంటా మోహన్, సీపీఐ, సీపీఎం, బీఎస్పీ ప్రతినిధులు, దళిత సంఘాల ప్రతినిధులు, విద్యార్థి సంఘాల నేతలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, ట్రేడ్ యూనియన్ నేతలు పాల్గొన్నారు.



## ఏటీసీ దాకా క్యూలైన్

సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో షెడ్లలు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ ఏటీసీ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

శనివారం నాటి హుండీ ఆదాయం: రూ.3.47 కోట్లు


ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 66,160

తలనీలాలు సమర్పించినవారు : 22,724

# చాయైనా.. బతుకైనా.. మట్టిలోనే..!

● 'పడమటి గాలి' నాటకంలో ఆకట్టుకున్న రాంకోటి ప్రతిన

● మాయోడి పాత్రలో ఆకట్టుకున్న రిటైర్డు ఐఏఎస్ బలరామయ్య





తన చాయైనా.. బతుకైనా.. మట్టిలోనే అని పిడికిట మట్టి సాక్షిగా రైతు రాంకోటు చేసిన శపథం.. 'పడమటి గాలి' నాటకంలో ఉద్వేగపూరితంగా కనిపించింది. తెలుగు భాషోద్యమ సమితి ఆధ్వర్యంలో పాటిబండ్ల ఆనందరావు రచించిన ఈ నాటకాన్ని సోమవారం సాయంత్రం తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో ప్రదర్శించారు. మాయోడి పాత్ర ద్వారా రిటైర్డు ఐఏఎస్ అధికారి బలరామయ్య అందరినీ ఆకట్టుకున్నారు. ధ్వంసమై పోతున్న గ్రామీణ జీవనాన్ని దృశ్యమానం చేసిందీ నాటకం. ఈ నాటకంలో దళారీ పాత్ర ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రిటైర్డు ఐఏఎస్ అధికారి బలరామయ్య ఈ పాత్రను పోషించారు. మల్టీనేషనల్ కంపెనీ ఏర్పాటు కోసం అవసరమైన భూ సేకరణలో జరిగిన సంఘర్షణ ఈ నాటకానికి ఇతివృత్తం. 50 ఎకరాల భూమి అవసరమవుతుంది. ఓ రైతుకున్న 4 ఎకరాల భూమిని ఎలాగైనా దక్కించుకోవాలని గ్రామంలోని దళారీ ద్వారా ఎత్తుగడ వేస్తారు. కొడుకు ద్వారానూ పన్నాగం పన్నుతారు. కడకు రైతును తన కొడుకు చేతులారా కడతేర్చడానికి కుట్ర చేస్తారు. ఎన్ని కుయుక్తులు పన్నినా నమ్ముకున్న భూమిని అమ్ముకోని రైతు రాంకోటు ఆత్మస్థైర్యం ఈ నాటకానికి పరాకాష్టగా నిలుస్తుంది. ఈ సందర్భంగా రచయిత పాటిబండ్ల ఆనందరావు మాట్లాడుతూ.. 25 ఏళ్లకుపైగా 150 ప్రదర్శనలు నిర్వహించినట్టు తెలిపారు. వేగవంతమైన జీవన శైలిని దృష్టిలో ఉంచుకొని రెండు గంటల నిడివితో ఈ నాటకాన్ని ప్రదర్శించినట్టు తెలిపారు. తిరుపతిలో ఇప్పటికీ ఈ నాటకానికి ఇంత ఆదరణ ఉండటం తనకు సంతోషాన్ని కలిగించిందని తెలిపారు. నాటక ప్రదర్శనకు ముందు తెలుగు భాషోద్యమ సమితి అధ్యక్షుడు సాకం నాగరాజు, తమటం రామచంద్రారెడ్డి, నాదెండ్ల శ్రీమన్నారాయణ తదితరులు మాట్లాడారు.

- తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి

# ప్రతి అర్జీనీ గడువులోపు పరిష్కరించండి

● కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌కు 150 వినతులు



అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలు అందజేసే అర్జీలను గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు 150 అర్జీలు అందగా, అందులో భూ సమస్యలపైనే 94 ఉన్నాయి. కలెక్టర్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవేంద్రరెడ్డి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

## మౌలిక వసతులు కల్పించండి



కల్యాణ వెంకటేశ్వరపురం గ్రామస్తులు

'పుత్తూరు మండలం నేసనూరు గ్రామ పంచాయతీ కల్యాణ వెంకటేశ్వరపురంలో ఇటీవల కురిసిన వర్షాలకు విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకోండి.. పంట నష్టపరిహారం కూడా ఇప్పించండి. రైతులకు డీకేటీ పాసుపుస్తకాలు, నివాస భూముల కోసం పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయండి' అంటూ గ్రామస్తులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు.

## పారా మెడికల్ రిజిస్ట్రేషన్ చేయండి



పారా మెడికల్ రిజిస్ట్రేషన్ చేయాలని కోరుతున్న విద్యార్థులు

విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో బీఎస్సీ, ఎంఎల్‌టీ కోర్సులు పూర్తి చేశామని, కళాశాల అధికారుల తప్పిదం వల్ల పారా మెడికల్ రిజిస్ట్రేషన్ కల్పించలేదని విద్యార్థులు దీప్తి, భూలక్ష్మి, చందు, పల్లవి, రమ్య కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పారా మెడికల్ రిజిస్ట్రేషన్, ఉపాధి కల్పించాలని అభ్యర్థించారు.

## ప్రత్యామ్నాయ స్థలం చూపండి

తిరుచానూరు రోడ్డులోని శ్రీనివాస కల్యాణ మండపాల సమీపంలో హథీరాంజీ మఠం స్థలంలో చేపలు విక్రయించి జీవనం సాగిస్తున్నామని, మున్సిపల్ అధికారులు అక్కడ వ్యాపారం చేయరాదని బెదిరిస్తున్నారని, ప్రత్యామ్నాయం చూపాలని వ్యాపారులు కోరారు. ఈ మేరకు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఏఐటీయూసీ నేతలు శ్రీనివాసులు, శివకుమార్, బాలాజీ, విజయ్, గురవయ్య పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న చేపల వ్యాపారులు

## రెండు బార్లకు ఈ టెండర్ల ఆహ్వానం

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నాయుడుపేట, సూళ్లూరుపేట మున్సిపాలిటీల పరిధిలో రెండుబార్లకు ఈ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 1 నుంచి వచ్చే ఏడాది ఆగస్టు 31 వరకు తొమ్మిది నెలల కాలానికి సంబంధించి బార్లు నిర్వహించేందుకు ఆన్‌లైన్ ద్వారా ఈనెల 22వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులు సమర్పించాలని కోరారు. 23న పరిశీలించి లాటరీ ద్వారా 24న అర్హులను ఎంపిక చేసి, దుకాణాలు కేటాయిస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం గూడూరు ఏఈఎస్ హహాశ్రీని 9440902265, నాయుడుపేట ఎక్సైజ్ సీఐ 9440902516, సూళ్లూరుపేట ఎక్సైజ్ సీఐ 9440902515, తిరుపతి కంట్రోలు రూము ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ 9603274401ను సంప్రదించాలని కోరారు.

# అసైన్‌మెంట్ భూముల విషయమై వివాదం

స్వాధీనానికి అధికారుల చర్యలు ● కుమ్మరిపాళెంలో ఇరువర్గాల ఘర్షణ



ఆక్రమణదారులతో ఘర్షణ పడుతున్న గ్రామస్తులు

చిట్టమూరు, డిసెంబర్ 16(ఆంధ్రజ్యోతి): గిరిజనులకు అసైన్‌మెంట్ పట్టా ఇచ్చిన భూముల విషయమై నెలకొన్న వివాదం ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. చిట్టమూరు మండలం బురదగాలి పంచాయతీ పరిధిలోని కుమ్మరిపాళెం గ్రామంలో సర్వే నెంబర్ 16లో 9ఎకరాల భూమిని గిరిజనులకు అసైన్‌మెంట్ పట్టాలిచ్చారు. అయితే గిరిజనులు చాలా ఏళ్లుగా స్థానికంగా నివాసం లేకపోవడంతో కోట మండలానికి చెందిన వైసీపీ నేత దగ్గర పనిచేసే హరికృష్ణ అనే వ్యక్తి సదరు భూములను స్వాధీనం చేసుకున్నాడు. దీనిపై కుమ్మరిపాళెం గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. తాను గిరిజనుల వద్ద భూములను కొనుగోలు చేశానని హరికృష్ణ చెప్పగా, ఇందుకు గ్రామస్తులు అభ్యంతరం తెలిపారు. దీంతో సదరు భూముల్లోకి ఎవరూ ప్రవేశించవద్దంటూ రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ క్రమంగా హరికృష్ణ వివాదాస్పద భూముల్లో వరి పంట సాగు చేశారు. దీంతో ఆ భూములను స్వాధీనం చేసుకొనేందుకు రెవెన్యూ అధికారులు, పోలీసులు సోమవారం కుమ్మరిపాళెం గ్రామానికి చేరుకున్నారు. తాను గిరిజనుల వద్ద భూములను కొనుగోలు చేశానని హరికృష్ణ అధికారులకు వివరించారు. అయితే అసైన్‌మెంట్ పట్టా పొందిన వారే భూములను సాగు చేసుకోవాలని, లేదంటే స్వాధీనం చేసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ఇంతలో గ్రామస్తులు జోక్యం చేసుకుని గిరిజనులు భూములను అమ్మలేదని, ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారని చెప్పారు. దీంతో గ్రామస్తులకు హరికృష్ణ, అతని సోదరుడు రామ్ కుమార్ మధ్య మాటామాటా పెరిగి ఘర్షణ చోటు చేసుకుంది. ఈ క్రమంలో ఇరువర్గాలకు స్వల్ప గాయాలయ్యాయి. కాగా, వివాదాస్పద భూములపై సర్వే చేయించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్వాధీనం చేసుకుంటామని రెవెన్యూ అధికారులు చెప్పారు.

## ఎయిర్‌పోర్టులో శ్రీవాణి కౌంటర్ల పరిశీలన



రేణిగుంట/ తిరుమల, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): రేణిగుంట ఎయిర్‌పోర్టులోని శ్రీవాణి టికెట్ల కౌంటర్లను టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు మంగళవారం పరిశీలించారు. భక్తుల నగదు చెల్లింపులు, టికెట్లు, రసీదు జారీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. రోజువారీ వివరాలపై కౌంటర్ సిబ్బందిని విచారించారు. టికెట్లపై పలువురు భక్తుల అభిప్రాయాలు స్వీకరించారు.

# ఆటో దొంగలు

జల్సాల కోసం చోరీలు.. ఇద్దరి అరెస్టు



ఆటోలతో పాటు నిందితులను చూపుతున్న క్రైం పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): వాళ్లిద్దరూ మంచి మిత్రులు. పదో తరగతి వరకు చదువుకున్నారు. జల్సాలు, వ్యసనాలకోసం దొంగతనాల వైపు అడుగులు వేశారు. కడప, తిరుపతి జిల్లాల్లో ఆటోలను దొంగలించి అమ్మే.. ఈ ఇద్దరిని తిరుపతి క్రైం పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. క్రైం డీఎస్పీ రమణకుమార్ తెలిపిన ప్రకారం.. స్నేహితులైన రేణిగుంట మండలం వేణుగోపాలపురానికి చెందిన దొడ్డి కార్తీక్, తిరుపతి సింగాలగుంటకు చెందిన కె.లలితకుమార్ చెడు అలవాట్లకు బానిసలయ్యారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో తొలుత మేకలను దొంగతనం చేసి సంతల్లో విక్రయించి ఆ డబ్బును పంచుకుని విలాసాలకు ఖర్చు పెట్టేవారు. కొంత కాలంగా కడప జిల్లా ఓబులవారిపల్లి, తిరుపతి చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆటోలను దొంగలించి విక్రయించే వారు. ఆ డబ్బుతో జల్సాలు చేసేవారు. ఇటీవల కొందరు బాధితుల ఫిర్యాదు మేరకు క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. డీఎస్పీ రమణకుమార్, సీఐ పెద్దరత్తయ్య, ప్రకాష్‌కుమార్, ఎస్ఐ ప్రదీప్‌కుమార్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ బసవరాజు, కానిస్టేబుళ్లు నాగరాజు, ప్రసాద్, మోహన్‌తో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఆటో దొంగలపై నిఘా పెట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పద రీతిలో తిరుగుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వీరు ఆటోలు దొంగిలించినట్లు చెప్పడంతో వారి నుంచి రూ.6 లక్షల విలువైన నాలుగు ఆటోలను సీజ్ చేశారు.

# పోలీసు పీజీఆర్ఎస్‌కు 90 వినతులు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఎస్పీ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 90 వినతులు వచ్చాయి. అదనపు ఎస్పీలు నాగభూషణం, రవిమనోహరాచారి, ఎస్పీ సీఐ శ్రీనివాసులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన వాటిని ఆయా పోలీసు స్టేషన్లకు పంపి, పరిష్కరించాలని ఆదేశించారు.



ప్రజల నుంచి అర్జీలు తీసుకుంటున్న ఎస్పీ సుబ్బరాయుడు

# అమ్మో.. పులి!

● వేద వర్సిటీలో భయాందోళన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని వేద విశ్వవిద్యాలయంలో పులి సంచారం ఆందోళన కలిగిస్తోంది. రెండు వారాల క్రితం పద్మావతి హాస్పిటల్ - వేద వర్సిటీ లైబ్రరీ మధ్య రాత్రి 9 గంటల సమయంలో పులి కనిపించింది. పులిని చూసిన విద్యార్థులు భయాందోళనతో పరుగులు తీశారు. మూడు రోజుల ముందు మరోసారి వేద వర్సిటీకి అలిపిరి రోడ్డు వైపు ఉన్న ఆర్చి వైపు నుంచీ ప్రవేశించిన పులి ఏడీ బిల్డింగ్ సమీపానికి వచ్చినట్టు తెలుస్తోంది. అక్కడ్నుంచి జింకను తరుముకుంటూ అకడమిక్ బిల్డింగ్ వైపు పులి వెళ్లినట్టు విద్యార్థులు, సెక్యూరిటీ సిబ్బంది గమనించినట్టు సమాచారం. ఈ విషయాన్ని ఫారెస్టు అధికారులకు యూనివర్సిటీ నుంచీ సమాచారం అందించారు. దీంతో ఫారెస్టు అధికారులు సోమవారం యూనివర్సిటీకి వచ్చి పరిస్థితిపై ఆరా తీసినట్టు తెలుస్తోంది. పులి సంచారం నేపథ్యంలో విద్యార్థులు, ఉద్యోగులు జాగ్రత్తగా ఉండాలని ఫారెస్టు అధికారులు సూచించారు. రాత్రి వేళల్లో అత్యవసరమైతే తప్ప వెలుపలకు రావొద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు. సెక్యూరిటీ సిబ్బంది గస్తీ కాస్తున్నారు.

## శ్రీవారి సేవలో ప్రముఖులు



జస్టిస్ భవాని ప్రసాద్ - జస్టిస్ వేలుమణి

తిరుమల, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఉడిపిలోని చిత్రాపూర్ మఠాధిపతి విద్యేంద్ర తీర్థ స్వామి, ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి భవానిప్రసాద్, కలకత్తా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వేలుమణి, తమిళనాడు మాజీ సీఎం పళనిస్వామి సతీమణి రాధ ఉన్నారు.



విద్యేంద్రతీర్థ స్వామి - రాధ

## పాపవినాశనం వద్ద ప్రత్యేకంగా పెట్రోలింగ్



సుదర్శన్‌రెడ్డి

మంగళం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుమల పాపవినాశనం వద్ద అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తున్న దుకాణాలను అడ్డుకునేందుకు ప్రత్యేక పెట్రోలింగ్ బృందం ఏర్పాటు చేసినట్టు తిరుపతి రేంజ్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన ఆంధ్రజ్యోతి విలేకరితో మాట్లాడుతూ కొన్ని రోజుల క్రితం పాపవినాశనం స్థల విశిష్టతను తెలుపుతూ ఏర్పాటు చేసిన బోర్డును కొందరు తొలగించారని, మళ్లీ ఏర్పాటు చేయించి, దాన్ని ఎవరు తొలగించారనే దానిపై విచారణ చేపట్టామని పేర్కొన్నారు. బోర్డు కటింగ్ చేయడానికి కాంట్రాక్టర్‌కు అప్పగించిన జనరేటర్‌ను వినియోగించారని గుర్తించామని, విచారణ పూర్తయిన తర్వాత బాధ్యులపై వైల్డ్‌లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్ ప్రచారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా ప్రత్యేక పెట్రోలింగ్ బృందాన్ని నిఘా ఉంచామని పేర్కొన్నారు.

# నగరి కేంద్రంగా రేషన్ బియ్యం అక్రమ రవాణా

లారీ సహా 19 టన్నుల బియ్యం సీజ్ ● ఎస్పీ ప్రత్యేక బృందం దాడుల్లో పట్టుబడిన వైనం



పట్టుబడిన రేషన్ బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్‌లో అన్‌లోడ్ చేస్తున్న కూలీలు

పుత్తూరు అర్బన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): నగరి కేంద్రంగా రేషన్ బియ్యం పక్కరాష్ట్రాలకు అక్రమ రవాణా అవుతోంది. గతంలో పుత్తూరు ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి రేషన్ బియ్యం పక్కదారి పట్టించి రూ.2.50 కోట్ల మేర అవినీతికి పాల్పడిన సీఎస్ డీటీ జైలులో ఊచలు లెక్కపెడుతున్నాడు. అయినా వ్యాపారుల్లో మార్పు రావడం లేదు. నగరి, పుత్తూరు పోలీసులకు సమాచారం ఇవ్వకుండానే జిల్లా ఎస్పీ పర్యవేక్షణలోని ప్రత్యేక బృందం రంగంలోకి దిగింది. అర్ధరాత్రి వేళ రేషన్ బియ్యం అక్రమంగా తరలిపోకుండా అడ్డుకుంది. ప్రత్యేక బృందం రంగ ప్రవేశంతో బియ్యం అక్రమ వ్యాపారుల వెన్నులో వణుకుపుడుతోంది. నగరి నుంచి పుత్తూరు మీదుగా కర్ణాటక రాష్ట్రానికి తరలిపోతున్న రూ.8.62 లక్షల విలువైన 19 టన్నుల రేషన్ బియ్యం సోమవారం పట్టుబడింది. తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు పర్యవేక్షణలోని ప్రత్యేక బృందం ఈ అక్రమ రవాణాను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. అనంతరం పట్టుబడిన బియ్యం సహా లారీని ప్రత్యేక బృందం పుత్తూరు పోలీసులకు స్వాధీనం చేసింది. సోమవారం వేకువజామున 3 నుంచి 4 గంటల మధ్య పుత్తూరు - తిరుపతి జాతీయ రహదారిలోని పీఆర్ మంగళం సమీపంలోని రాజస్థాన్ దాబా వద్ద ప్రత్యేక బృందం కాపుకాసింది. ముందస్తు సమాచారం మేరకు లారీని ఆపి తనిఖీ చేసింది.లారీలో రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు నిర్ధారించుకుంది. నగరికి చెందిన బియ్యం వ్యాపారి పొడుగు బాలా, పొన్నుస్వామి, గణేష్ బియ్యాన్ని తరలిస్తున్నట్టు విచారణలో తేలింది. నగరి దేశమ్మ ఆలయ సమీపం నుంచి 50 కిలోల చొప్పున 375 బస్తాలను లారీలో లోడ్ చేయించినట్లు డ్రైవర్ యువరాజ్(31) తెలిపారు. కరాటక రాష్ట్రం బంగారుపేట ఆర్కే రైస్ మిల్‌కు ఈ బియ్యాన్ని తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. కేసు నమోదు చేసిన పోలీసలు పట్టుబడిన బియ్యాన్ని ఎంఎల్‌సి పాయింట్‌కు తరలించారు. లారీని సీజ్ చేశారు. బియ్యం అక్రమ రవాణాకు పాల్పడిన వ్యాపారులను, రైస్ మిల్లు యజమానికి అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు గాలిస్తున్నారు.

## సీమ పందుల పెంపకంతో వ్యాపారవేత్తలుగా ఎదగాలి



జ్యోతి వెలిగిస్తున్న డీఈ శోభామణి, డీఆర్ శ్రీలత

తిరుపతి రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : శాస్త్రీయ పద్ధతుల ద్వారా వాణిజ్య సరళిలో సీమపందుల పెంపకాన్ని చేపట్టి వ్యాపారవేత్తలుగా ఎదగాలని వెటర్నరీ వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ శ్రీలత తెలిపారు. 'శాస్త్రీయ పద్ధతుల్లో సీమపందుల పెంపకం' అంశంపై రైతులు, యువతకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను సోమవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. సీమపందుల పెంపకం ద్వారా కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవడంతో పాటు ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ డాక్టర్ శోభామణి ఆకాంక్షించారు. సీసీవీఈసీ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ కె.సుజాత, ఏబీసీఆర్‌పీ ప్రధాన శాస్త్రవేత్త కల్యాణచక్రవర్తి, డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

## తిరుమలలోనూ ఇకపై హెల్మెట్ తప్పనిసరి

అమలుపై అధికారుల కసరత్తు

తిరుమల, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): తిరుమలలోనూ ఇకపై ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ అధికారులు నిర్ణయించారు. ప్రమాదాల నివారణ కోసం ఇప్పటికే కొన్నేళ్లుగా తిరుమల మొదటి, రెండో ఘాట్‌లో హెల్మెట్ తప్పనిసరి నిబంధన కొనసాగుతున్న విషయం తెలిసిందే. అయితే తాజాగా, తిరుమలలో తిరిగే ద్విచక్రవాహనదారులకు కూడా హెల్మెట్ తప్పనిసరి చేయాలని పోలీసు అధికారులు భావిస్తున్నారు. ఇందులో భాగంగానే మంగళవారం కొన్ని ప్రాంతాల్లో భక్తులు, స్థానికులు, వ్యాపారులు, ఉద్యోగులకు హెల్మెట్ పెట్టుకుని డ్రైవ్ చేయాలని సూచించారు. ఇక, అతి తక్కువ పరిధిలో ఉండే తిరుమలలో ద్విచక్రవాహనాలపై వేగంగా వెళ్లే అవకాశం ఉండదు. అలాంటప్పుడు తిరుమలలో హెల్మెట్ నిబంధన అవసరమా అనే చర్చ మొదలైంది. అయితే ద్విచక్రవాహనదారుల భద్రత కోసం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల సూచనల మేరకు ఈ నూతన నిర్ణయాన్ని అమలుచేయాలనే ఆలోచన చేస్తున్నట్టు పోలీసులు చెబుతున్నారు.

# వృద్ధురాలి హత్య

● బంగారు నగలు అపహరించిన నిందితులు

● పాడిపేటలో కలకలం



హత్యకు గురైన జీవరత్నమ్మ

తిరుచానూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం పాడిపేటలో ఓ వృద్ధురాలు హత్యకు గురైన ఘటన సోమవారం సాయంత్రం వెలుగుచూసింది. తిరుచానూరు సీఐ సునీల్ కుమార్ కథనం మేరకు.. పాడిపేట మాజీ సర్పంచ్ దివంగత గణేష్‌శెట్టి భార్య జీవరత్నమ్మ(63) తన కుమార్తె లలితతో కలిసి నివాసం ఉంటోంది. నారాయణవనంలోని ఐఆర్‌డీఏస్ సంస్థలో లలిత ఉద్యోగిని. సోమవారం ఉదయం ఆమె విధులకు వెళ్లారు. ఇద్దరు మనవరాళ్లు కళాశాలకు వెళ్లారు. జీవరత్నమ్మ ఒకరే ఇంట్లో ఉన్నారు. మధ్యాహ్నం పక్కనే దుకాణానికి మిద్దెపైనుంచి దిగి వచ్చారు. ఆ తరువాత ఏం జరిగిందో తెలియదు. సాయంత్రం 5.30 గంటలకు విధులు ముగించుకుని ఇంటికి వచ్చిన లలిత.. మొదటి అంతస్తులో తలుపులు తెరచివుండటం, బెడ్‌పై విగతజీవిగా పడి ఉన్న తల్లిని చూసి నిశ్చేష్టురాలయ్యారు. సమాచారం తెలుసుకున్న అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్, క్లూస్‌టీం చేరుకున్నారు. మధ్యాహ్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి మొదటి అంతస్థుకు చేరుకుని జీవరత్నమ్మ నోటిని గుడ్డతో అదిమిపెట్టి ఊపిరి ఆడకుండా హత్య చేసి మెడలో ఉన్న వంద గ్రాముల బంగారు నగలను లాక్కెళ్లినట్లు సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. హత్య కేసుగా నమోదు చేసి జీవరత్నమ్మ మృతదేహాన్ని రుయా మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

# 14 మంది వ్యవసాయ కూలీలకు అస్వస్థత



ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రైతు కూలీలు

వెంకటగిరి టౌన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): వరినాట్లు వేసేందుకు వచ్చిన కూలీలు అస్వస్థతకు గురయ్యారు. దీనికి కలుషిత ఆహారం కారణమని భావిస్తున్నారు. ఈ సంఘటన సోమవారం వెంకటగిరి మండలం చెలికంపాడు గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. నాగరాజు అనే రైతు పొలంలో వరి నాట్లు వేసేందుకు వచ్చిన కూలీలు మధ్యాహ్నం వరకు నాట్లు వేశారు. వీరికి పొలం వద్దే యజమాని మధ్యాహ్నం ఆహారాన్ని వండించారు. అందరూ కలిసి ఈ ఆహారాన్ని తిన్నారు. కొంతసేపటికి కొంతమంది కూలీలకు వాంతులు, విరోచనాలు అయ్యాయి. దీంతో 14 మంది కూలీలను చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి సిబ్బంది సకాలంలో వైద్య సేవలు అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని కూలీలు ఆరోపిస్తున్నారు. దీంతో వీరు ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. కలుషిత ఆహారమే దీనికి కారణమని భావిస్తున్నారు. కాగా, వెంకటగిరి ప్రభుత్వాస్పత్రిలో వైద్యులు, సిబ్బంది పనితీరు దారుణంగా ఉందని రైతులు కృష్ణయ్య, రమణయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. వైద్యం కోసం వచ్చిన బాధితులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలంటూ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ డీహెచ్ఎస్ ఆనందమూర్తితో ఫోన్‌లో మాట్లాడారు.

## ఏనుగుల దాడులతో పంటల ధ్వంసం



ఏనుగులు ధ్వంసం చేసిన చెరుకు తోట

సోమల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆవులపల్లె పంచాయితీ వంగసానివారిపల్లె సమీపంలో మూడు ఏనుగులు ఆదివారం రాత్రి పంట పొలాల్లో దాడులు చేసి రైతులను నష్టపరిచాయి. నాగరాజుకు చెందిన వరి, చెరుకుతోటల్లో సంచరించి పంటను తొక్కి నాశనం చేశాయి. బండపై నిల్వ చేసిన ధాన్యాన్ని తొక్కేశాయని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. వర్షం కారణంగా ఇప్పటికే నేలవాలిన వరితో నష్టపోయిన తమను ఏనుగులు తీవ్రంగా ఇబ్బంది కలిగిస్తున్నాయని వాపోయారు. కలమందలవారిపల్లె సమీపంలో కోతకు సిద్ధంగా ఉన్న టమోటా తోటలో ఊత కర్రలను విరిచేసి నష్టం చేశాయి. నెలరోజులుగా రాని ఏనుగులు మళ్లీ ధ్వంసం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం



బోల్తా పడిన మినీ వ్యాను, విరిగిన విద్యుత్ స్తంభం



ప్రభాకర్ మృతదేహం

శ్రీరంగరాజపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎస్ఆర్‌పురం మండలం య.ఎం.పురం గ్రామానికి చెందిన ప్రభాకర్(52) బ్యాంకులో పని నిమిత్తం సోమవారం 49.కొత్తపల్లెమిట్టకు బైక్‌పై వెళ్లారు. పని ముగిశాక ఇంటికి బయల్దేరారు. మార్గమధ్యంలో చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై బసివిరెడ్డిపల్లె వద్దకొచ్చేసరికి పళ్లిపట్టు నుంచి చిత్తూరు వైపు వస్తున్న మినీ వ్యాను అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ప్రభాకర్‌ను ఢీకొంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. అలాగే అక్కడున్న విద్యుత్ స్తంభాన్ని కూడా వ్యాను ఢీకొట్టడంతో అది విరిగిపోయింది. వ్యాను కూడా బోల్తా పడింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## జాతీయ బాస్కెట్ బాల్ పోటీలకు ఇద్దరి ఎంపిక



అంజలి, జాస్మిన్

బంగారుపాళ్యం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న అంజలి, జాస్మిన్‌లు సబ్ జూనియర్ జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం రాజేంద్ర తెలిపారు. హైదరాబాద్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టుకు వీరు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ సోమవారం అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు చెందిన హైపై సౌజన్యంతో పాఠశాలలో రెండేళ్లుగా 70 మంది విద్యార్థినులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. పీడీ గిరిజ, కోచ్ సలీమ్ పాల్గొన్నారు.

## జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక



తేజశ్రీ

వెదురుకుప్పం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు వెదురుకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న తేజశ్రీ ఎంపికైనట్లు హెచ్ఎం శ్రీనివాసులు, వ్యాయామ సంచాలకుడు రమేష్ తెలిపారు. ఈనెల 18 నుంచి 23వ తేదీవరకు జమ్ముకశ్మీర్‌లో జరిగే జాతీయ స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొంటుందన్నారు. సోమవారం ఈ విద్యార్థినిని ఉమ్మడి చిత్తూరు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జనార్ధన్ యాదవ్, రమేష్ అభినందించారు.

## తక్కువ డెలివరీలు జరిగే పీహెచ్‌సీలపై నిఘా

### - డీఎంహెచ్‌వో ప్రభావతీదేవి

చిత్తూరు రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మాతాశిశు సంరక్షణ పీహెచ్‌సీ వైద్యాధికారుల బాధ్యతని డీఎంహెచ్‌వో ప్రభావతీదేవి తెలిపారు. సోమవారం జిల్లాలోని పీహెచ్‌సీ వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తక్కువ డెలివరీలు జరిగే పీహెచ్‌సీలపై నిఘా ఉంచాలని ప్రోగ్రామ్ ఆఫీసర్లను ఆదేశించారు. హైరిస్క్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. మాతాశిశు మరణాలు జరగడానికి వీల్లేదన్నారు. శిశువులకు రోగనిరోధక టీకాలు క్రమం తప్పకుండా వేయించాలని చెప్పారు.

### మామిడి పంట బీమాకు

## ఈ-పంట నమోదు తప్పనిసరి

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మామిడి పంట బీమాకు ఈ-పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని ఉద్యానశాఖాధికారి మధుసూదన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాతావరణ ఆధారిత బీమా పథకం కింద ఎకరాకు రూ.35వేల బీమా వర్తించేందుకు రైతు వాటా కింద రూ.1,750 ప్రీమియం చెల్లించాలన్నారు. డిసెంబరు ఒకటి నుంచి 2025 మే 31వ నాటి వరకు వాతావరణ ప్రతికూల పరిస్థితుల కారణంగా జరిగే మామిడి పంట నష్టానికి బీమా వర్తిస్తుందని వివరించారు. రైతు సేవా కేంద్రాల్లోని ఇన్‌చార్జిలను కలిసి రబీ సీజన్‌కు అవసరమైన ఈ-పంట నమోదును రైతులు తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు.

## రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం జిల్లావ్యాప్తంగా సోమవారం ఏడు సదస్సులు జరిగాయి. ఇందులో స్థానిక ప్రజాప్రతినిధులు, మండల రెవెన్యూ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. వివిధ సమస్యలతో కూడిన అర్జీలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి.. 11 చిన్నచిన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు 5,051 అర్జీలు అందగా, సోమవారం మరో 39 అర్జీలందాయి. ఇప్పటివరకు 215 సదస్సులు జరగ్గా, పాల్గొన్న వారి సంఖ్య 17,597కు చేరింది.

## దుబాయ్‌లో ఉప్పలదడియం అవధానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన అవధాని ఉప్పలదడియం భరత్‌కుమార్ శర్మ త్వరలో దుబాయ్‌లో అవధాన కార్యక్రమం చేపట్టనున్నారు. గురువు వద్దిపర్తి పద్మాకర్‌తో కలిసి ఈ నెల 19 నుంచీ 26వ తేదీ దాకా దుబాయ్‌లో అవధానం నిర్వహించనున్నారు.

## వైభవంగా మనోన్మణి ఉత్సవం



శ్రీకాళహస్తి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ముక్కంటీశుడి ఆలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని సోమవారం మనోన్మణి (గొబ్బెమ్మ) ఉత్సవం వైభవంగా నిర్వహించారు. మొదట ఆలయ అలంకార మండపంలో గొబ్బిదేవతకు పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చరణల మధ్య అమ్మవారిని చప్పరంపై అధిష్ఠింపజేసి పట్టణంలో ఊరేగించారు. అమ్మవారికి భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు.

# కుంటను పూడ్చే వారిపై చర్యలు తీసుకోండి

- కలెక్టర్‌కు మొరపెట్టుకున్న గ్రామస్తులు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): 'కాణిపాకం రెవెన్యూ లెక్క దాఖల సర్వే నెంబరు 2-1లో గతంలో 40 కుటుంబాల వారికి ఇంటి పట్టాలివ్వడంతో నివాసం ఉంటున్నాం. అదే సర్వే నెంబరులో మిగిలిన ఎకరం భూమిలో ఆవులు, మేకలు మేపుకోవడంతోపాటు వాటిదప్పిక తీర్చడానికి కుంట కూడా ఉంది. ఎంత కరువు వచ్చిన ఆ కుంటలో నీరు ఉంటుంది. ప్రస్తుతం కొందరు ఆ కుంటను పూడ్చి.. ప్లాట్లు వేసి అమ్ముకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు' అని కాణిపాకంతోపాటు తిరువణంపల్లె, చినకాంపల్లె వాసులు తెలిపారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ భూమిని కాపాడాలని కోరారు. కాగా, కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌కు మొత్తం 185 అర్జీలు అందాయి. వీటిల్లో రెవెన్యూకే అత్యధికంగా 161 వచ్చాయి. బాధితుల నుంచి అర్జీలను కలెక్టర్‌తోపాటు జేసీ విద్యాధరి, డీఆర్వో మోహన్‌కుమార్, చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులురెడ్డి స్వీకరించారు.

**ప్రధాన అర్జీలు ఇలా..**

నష్టపరిహారం ఇచ్చాకే రహదారి విస్తరణ పనులు చేపట్టాలని చిత్తూరు నగరంలోని హైరోడ్డు భవన యజమానులు విన్నవించారు. అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదన్నారు. కోర్టులో తాము వేసిన కేసులు విచారణలో ఉన్నాయని గుర్తుచేశారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా నగరపాలక అధికారులు నిర్మాణాలను తొలగించడం అన్యాయమన్నారు.

- నగరి నియోజకవర్గంలో రేషన్‌బియ్యం స్మగ్లింగ్, ఇసుక దోపిడి, గంజాయి అమ్మకం జరుగుతోందని టీడీపీ సీనియర్ నేత రామానుజం చలపతి ఆరోపించారు. కలెక్టరేట్ వద్ద చెవిలో పూలు పెట్టుకుని.. కళ్లకు గంతలు కట్టుకుని మహిళలతో కలిసి నిరసన తెలిపారు. వీరికి సహకరిస్తున్న అధికార పార్టీ ప్రజాప్రతినిధులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
- తన భూమిని ఆక్రమించుకున్న చర్యలు తీసుకోవాలని పలమనేరు మండలం గబ్బిళ్ల కోటూరుకు చెందిన ఆదిలక్ష్మి కోరారు. తన భర్తకు పూర్వీకుల నుంచి 82 సెంట్ల సాగు భూమి ఉందన్నారు. ఈ భూమిలో 22 సెంట్ల భూమిని తన భర్త బంధువులు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. సర్వే చేసి తన భూమిని ఇప్పించాలని కోరారు.
- సర్వే నెంబరు 663, 111-6లో 3.14 ఎకరాల భూమి తన తండ్రి పేరుపై ఉందని పుంగనూరు మండలం మేలందొడ్డి గ్రామానికి చెందిన హరినాథ్ తెలిపారు. ఈ భూమిని పుంగనూరుకు చెందిన ఓ వ్యక్తి ఆక్రమించుకుని.. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నాడని ఆరోపించారు. విచారించి న్యాయం చేయాలని కోరారు.
- జీవనాధారం లేని తనకు వితంతు పింఛన్‌ను మంజూరు చేయాలని యాదమరి మండలం కోణాపల్లె పంచాయతీలోని నర్రావూరు ఎస్సీ కాలనీకి చెందిన సుందరమ్మ కోరారు. 2023లో తన భర్త మరణించారని, అప్పటి నుంచి పూట గడవటమే కష్టంగా ఉందన్నారు.
- తన తండ్రి రోశయ్య పేరుపై సర్వేనెంబరు 417-4లో 76 సెంట్ల భూమి ఉందని కార్వేటినగరం మండలం కేశవకుప్పం ఎస్సీ కాలనీకి చెందిన సుబ్బులమ్మ తెలిపారు. ఆయన ఇటీవలే మరణించారని, తండ్రి పేరుపై ఉన్న భూమిని తన పేరుపై మార్చాలని పలుమార్లు రెవెన్యూ అధికారులను కోరినా పట్టించుకోవడం లేదన్నారు.



కుంటను పూడ్చుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్న కాణిపాకం, ఇతర గ్రామాల రైతులు, కలెక్టరేట్ వద్ద హైరోడ్డు బాధితులు



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరి, ఇతర అధికారులు

## పోలీసు శాఖకు 32 అర్జీలు



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

పోలీసుశాఖ నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 32 అర్జీలు అందాయని ఎస్పీ మణికంఠ తెలిపారు. వీటిలో భూ తగాదాలపై 11, డబ్బు తగాదాలపై 5, కుటుంబ తగాదాలపై 5, వేధింపులపై 3, ఇంటి తగాదాలపై 3, ఆస్తి తగాదాలపై 3, చీటింగ్‌పై 2 చొప్పున ఉన్నాయి. చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ పాల్గొన్నారు.

## వంతెన మరమ్మతులు యుద్ధప్రాతిపదికన చేపట్టండి

- కలెక్టర్ సుమిత్‌కుమార్



వంతెన వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్, ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరి- కీళపట్టు మధ్య కుశస్థలి నదిపై భారీ వర్షాలకు కొట్టుకుపోయిన వంతెన మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం ఈ వంతెనను ఆయన పరిశీలించారు. తాత్కాలికంగా కాంక్రీట్ పనులు చేపట్టి వాహన రాకపోకలను పునరుద్ధరించాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. అయితే శాశ్వత పరిష్కార దిశగా వంతెన నిర్మాణాన్ని చేపట్టాలని కలెక్టర్‌ను ఈ సందర్భంగా నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ కోరారు. నిర్మాణంలో స్థానికులకే పనులు కల్పించాలన్నారు. అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాలన్నారు. నిధులు మంజూరయ్యే విధంగా కృషి చేస్తానని చెప్పారు. వంతెన ఎత్తు పెంచకపోతే ప్రజలకు ఇబ్బందులు తప్పవని, ఫ్లైఓవర్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులతోపాటు నగరి ఆర్డీవో భవాని శంకరి, కమిషనర్ కృష్ణారెడ్డి, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో సతీష్, ఆర్అండ్‌బీ, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులతోపాటు టీడీపీ నేతలు పాల్గొన్నారు.



గడ్డంవారిపల్లె వద్ద పొలంలో మొలకలు వచ్చిన వరి పంట

## వరి రైతు దిగాలు

చౌడేపల్లె, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వరుస తుఫాన్లతో వరి పంటకు మొలకలొచ్చాయి. గత వారం కురిసిన వర్షాలకు మండలంలో 750 ఎకరాలలో వరి పంట దెబ్బతింది. వర్షం ఆగినా ఇంకా పొలాల్లో పంట నీటిలోనే ఉంది. దీంతో కొన్నిచోట్ల మొలకలు వచ్చాయి. కోతకు కూలీలు దొరక్క పోవటం, నూర్పిడి యంత్రాలకు డిమాండు ఏర్పడటంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. సకాలంలో యంత్రాలు అందుబాటులో లేక వరికి మొలకలు వచ్చాయని బాధిత రైతులు ఆవేదన చెందుతున్నారు. ఆదుకోవాలని కోరుతున్నారు.

### ఇక ప్రశ్నపత్రాలన్నీ

# పోలీసు స్టేషన్ నుంచే తెచ్చుకోవాలి

- ప్రభుత్వ పాఠశాలల్లో గైడ్లను ప్రోత్సహించొద్దు
- ఆర్జేడీ శామ్యూల్ ఆదేశాలు



సిబ్బందితో సమావేశమైన ఆర్జేడీ శామ్యూల్

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రశ్నపత్రాలను ఇకపై సమీప పోలీసు స్టేషన్ (పీఎస్)లో డిపాజిట్ చేసి, పరీక్షల సమయంలో తీసుకోవాలని ఆర్జేడీ శామ్యూల్ ఆదేశాలు జారీ చేశారు. డీఈవో కార్యాలయంలో సోమవారం నుంచి మూడ్రోజులపాటు చేపట్టే తనిఖీల్లో భాగంగా జిల్లాకు వచ్చిన ఆయన పలు అంశాలను మీడియాకు వివరించారు. ప్రస్తుతం సమ్మెటివ్ అసెస్మెంట్-1 పరీక్షల్లో భాగంగా ఆదివారం యూట్యూబ్‌లో గణితం సబ్జెక్టు పేపర్లు లీక్ కావడంతో కమిషనర్ ఆదేశాల మేరకు 6వ తరగతి నుంచి టెన్త్ వరకు పరీక్షను వాయిదా వేసినట్లు తెలిపారు. దీనిపై విజయవాడలో కమిషనర్ స్థాయిలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. తనిఖీలయ్యాక నివేదికలను కమిషనర్‌కు పంపుతామన్నారు.

**20న గణిత పరీక్ష**

వాయిదా పడ్డ గణిత పరీక్షను ఈనెల 20వ తేదీన నిర్వహించనున్నట్లు ఆర్జేడీ తెలిపారు. జిల్లాలో వర్షాల కారణంగా ఈనెల 12, 13 తేదీల్లో జరగాల్సిన హిందీ, ఇంగ్లీష్ పరీక్షల తేదీలను తర్వాత ప్రకటిస్తామన్నారు. మంగళవారం నుంచి జరగాల్సిన ఫిజిక్స్, బయాలజీ, సోషియల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సబ్జెక్టుల ప్రశ్నపత్రాలను సోమవారం రాత్రికి మండలాల్లోని సమీప పోలీసు స్టేషన్‌లో డిపాజిట్ చేయనున్నట్లు వివరించారు. పరీక్ష సమయానికి ప్రశ్నపత్రాలను పీఎస్ నుంచి తీసుకోవాలని డీఈవో, డీవైఈవో, ఎంఈవో, హెచ్ఎంలకు ఆదేశాలు జారీ చేశామన్నారు. పరీక్షల నిర్వహణలో ఉమ్మడి జిల్లా పరీక్షల విభాగం కీలక పాత్ర పోషించాలని సూచించారు. టెన్త్ విద్యార్థులకు మంచి ఫలితాలు సాధించేలా వంద రోజుల ప్రణాళికను అమలు చేస్తున్నామన్నారు. హెచ్ఎంలు గైడ్స్‌ను పాటించాలని ప్రోత్సహించడం సరికాదని హెచ్చరించారు. ప్రైవేటు పాఠశాలల్లోనూ ప్రభుత్వ ప్రశ్నపత్రాన్ని అనుసరించే చర్యలు చేపడతామన్నారు. అంతకుముందు కమిషనరేట్ నుంచి సమ్మెటివ్ పరీక్షల నిర్వహణపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో డీఈవో వరలక్ష్మి, సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి, డీవైఈవో చంద్రశేఖర్, డీసీఈబీ కార్యదర్శి పరశురాంతో కలిసి ఆర్జేడీ పాల్గొన్నారు.

## తిరుపతి-పాకాల మధ్య రెండవ మార్గం

- సర్వే పనులకు రైల్వేబోర్డు అనుమతి



తిరుపతి(సెంట్రల్), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి-పాకాల రైల్వే స్టేషన్ల మధ్య పెండింగ్‌లో వున్న రెండవ రైలు మార్గం సర్వే పనులకు రైల్వే బోర్డు అనుమతించినట్లు సమాచారం. ఈ మార్గం మీటర్ గేజ్ నుంచి బ్రాడ్ గేజ్‌కు మారిన తరువాత రైళ్ల సంఖ్య బాగా పెరిగింది. పెరిగిన రైళ్ల కారణంగా తిరుపతి-పాకాల-ధర్మవరం మధ్య రాకపోకలకు ఆలస్యం అవుతోంది. దీంతో ఈ మార్గంలో రెండవ రైలు మార్గం ఏర్పాటు చేయాలని తిరుపతికి వచ్చిన ఉన్నతస్థాయి అధికారులకు చాలాకాలంగా ప్రజా ప్రతినిధులు వినతులు ఇస్తున్నారు.కొన్నేళ్ళుగా ప్రజాప్రతినిధుల పోరాటం ఫలించింది.రైల్వే ఉన్నతాధికారులు స్పందించి రెండవ రైలు మార్గం ఏర్పాటుపై సర్వే చేయాలని క్షేత్ర స్థాయి అధికారులను ఆదేశించారు.రైల్వే నిర్మాణాల విభాగం అధికారులు సర్వే పనులు ప్రారంభించారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో 47 మద్యం కేసుల పరిష్కారం

- రూ.2.30 లక్షల జరిమానా వసూలు

పుత్తూరు అర్బన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌లో 47 మద్యం కేసులు పరిష్కారమయ్యాయని పుత్తూరు ఎక్సైజ్ శాఖ సీఐ మురళీ మోహన్ పేర్కొన్నారు. ఇందుకు రూ.2.08 లక్షల జరిమానాను నిందితులు చలానా రూపంలో చెల్లించినట్లు తెలిపారు. ఎక్సైజ్ శాఖ దాడుల్లో పట్టుబడిన మద్యం అక్రమ విక్రయదారులపై కేసులు నమోదయ్యాయి. పది లీటర్లకు లోబడి పట్టుబడిన మద్యం కేసులను మాత్రమే లోక్ అదాలత్‌లో పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు సీఐ చెప్పారు. ఈక్రమంలో 2023 నుంచి నమోదైన కేసులను ఈనెల 14న శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో పెట్టినట్లు తెలిపారు. పట్టుబడిన మద్యం ఎమ్మార్పీ ఆధారంగా మూడు రెట్లు జరిమానా విధించి నిందితుల నుంచి చలానా రూపంలో చెల్లింపులు చేయించామన్నారు. ఛార్జ్‌షీట్ మొదలు హియరింగ్, క్రాస్ ఎగ్జామిన్, వాయిదాలకు హాజరు వంటి పరిణామాలు లోక్ అదాలత్ ద్వారా అధిగమించినట్లు నిందితులు చెబుతుండటం గమనార్హం.

## ఆగమోక్తంగా మృత్యుంజయుడికి పూజలు



శ్రీకాళహస్తి, డిసెంబరు 16 (ఆంధ్ర జ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మృత్యుంజయస్వామికి సోమవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరిగాయి. ముందుగా వినాయకుడికి పూజలు చేశారు. అనంతరం మృత్యుంజయుడికి పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంతో అభిషేకించారు. గజమాల, వెండి నాగాభరణంతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

### నష్టాల బాటలో

# టమోటా రైతు

- వరుస వానలతో పంటకు చేటు
- ధరలు లేక పెట్టుబడి రాక దిగాలు



ధరలు లేక టమోటా పంటను పొలంలోనే వదిలిపెట్టిన రైతులు

పలమనేరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): టమోటా రైతులను ప్రకృతితో పాటు ధరలు కూడా ముంచేశాయి. నెలరోజులుగా పదేపదే వర్షాలకు ముసురు పట్టుకోవడంతో పంటలు దెబ్బతిన్నాయి. అదే సమయంలో మార్కెట్‌యార్డులో కూడా ధరలు గణనీయంగా పడిపోయాయి. దీంతో రైతులు భారీగా నష్టపోయారు. ఈసారి అధిక దిగుబడి వంగడాలను ఎంచుకొని ఆధునిక పద్ధతుల్లో సాగు చేశారు. గతంలో కంటె భిన్నంగా ఎకరాకు కనీసం రూ.3లక్షల నుంచి రూ.4లక్షల పెట్టుబడి పెట్టారు. పంట వేసిన నెలరోజులలోపే మొక్క పడిపోకుండా ఊతకర్రలను ఏర్పాటు చేశారు. ఇందుకు అధికంగా వెచ్చించాల్సి వచ్చింది. పూతదశకు రాగానే డ్రిప్పుల ద్వారా వేలాది రూపాయలు వెచ్చించి రసాయన ఎరువులను వేశారు. చీడపీడల నివారణకు భారీగానే ఖర్చు పెట్టామని రైతులు చెప్పారు. ఈనేపథ్యంలో ఎకరాకు కనీసం రూ.4లక్షల పైన వస్తేగాని పెట్టుబడి రాని పరిస్థితి. దీనికితోడు కూలీల వ్యయం తడిసి మోపెడవుతోంది. ఇంతచేసినా నెలరోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు కుదేలవుతున్నారు. టమోటా ధరలు పడిపోవడం మరింత నిరాశపర్చింది. కొందరు కోయకుండా పంటను పొలాల్లో విడిచిపెట్టేశారు. పెట్టుబడికి చేసిన రుణాలకు వడ్డీలు కూడా కట్టుకోలేని పరిస్థితిలో ఉన్నామని రైతులు వాపోతున్నారు.

## నత్తనడకన ఇండోర్ స్టేడియం పనులు

- శాప్ చైర్మన్ అసహనం



పనులపై చర్చిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో చేపడుతున్న ఖేలో ఇండియా మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం పనులు నత్తనడకన సాగుతుండడంపై శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు అసహనం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం, యూనివర్సిటీ, శాప్ సంయుక్త నిధులతో నిర్మిస్తున్న స్టేడియం పనులను వీసీ వి.ఉమాతో కలిసి ఆయన సోమవారం పరిశీలించారు. నిధులు పూర్తి స్థాయిలో మంజూరు చేసినా కాంట్రాక్టర్ పనితీరుపై అసంతృప్తి చెందారు. ఉడెన్ కోర్టు, లైటింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఖోఖో కోర్టుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎన్.రజనీ, పీఈడీ ఎస్.సరోజినీ, డీఎస్‌డీవో సయ్యద్‌సాహెబ్, టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి మహేష్‌యాదవ్, కొట్టె హేమంత్‌రాయల్, రంజిత్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే అమర్‌కు సాగునీటి సంఘాల సారథుల సత్కారం



పలమనేరు, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో పలమనేరు, గంగవరం, బైరెడ్డిపల్లి, వి.కోట మండలాల సాగునీటి సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షులు, సభ్యులు సోమవారం ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని కలిశారు. శాలువలు కప్పి, పూలమాలలు వేసి సన్మానించారు. కార్యక్రమాల్లో ఆయా మండల టీడీపీ నాయకులు బీఆర్సీకుట్టి, గిరిబాబు, సోమశేఖర్‌గౌడు, కిషోర్‌గౌడు, రంగనాథ్, ఆనంద్, మురహరిరెడ్డి, శ్రీరాములు, నాగరాజు, ఖాజాపీర్, చాంద్ బాషా, మదన్‌మోహన్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## వానొస్తే వంట తయారీకి ఇబ్బందులే..



అసంపూర్తిగా వదిలేసిన వంటగది

సోమల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కందూరు హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం తయారీ,నిర్వహణలకు వంట గది లేక ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ 478 మంది విద్యార్థులున్నారు. పదేళ్ల క్రితం గది నిర్మాణం ప్రారంభించి అసంపూర్తిగా వదిలేశారు. నాడు- నేడు నిధులతో భవనాలు నిర్మించినా వంట గది పనులు పూర్తి చేయలేకపోయారు. చెట్ల కింద వంట తయారు చేస్తున్నారు. వర్షాకాలం ఇబ్బంది పడుతున్నారు. ఎండాకాలం చెట్ల ఆకులు రాలుతూ వంటల్లో పడుతున్నాయి. అధికారులు స్పందించి వంట గది నిర్మాణం చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## చలి తీవ్రతతో ఉక్కిరిబిక్కిరి



సోమల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చలి తీవ్రత రోజు రోజుకూ పెరుగుతోంది. ఉదయం 9 గంటలకు కూడా రైతులు వ్యవసాయ పనులు చేపట్టలేకపోతున్నారు. మంచు వీడిన అనంతరం పనులకు వెళ్తున్నారు. మంచు తుంపర్లతో పంటలకు చీడలు వ్యాపిస్తున్నాయని వీరు ఆందోళన చెందుతున్నారు. పెద్దఉప్పరపల్లె, ఆవులపల్లె, బోనమందు, ఆవులపల్లె తదితర ప్రాంతాల్లో చలి తీవ్రత వల్ల రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

## చెరువుల అభివృద్ధికి సహకారం: చల్లాబాబు



చల్లాబాబును సత్కరిస్తున్న నాయకులు

రొంపిచెర్ల, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి) రొంపిచెర్లలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లారామచంద్రారెడ్డిని సదం, పీలేరు మండల నాయకులు సత్కరించారు. సదుం మండలం తాటిగుంటపాళెం, అగ్రహారం సాగునీటి ఎన్నికల్లో టీడీపీ మద్దతు దారులు విజేతలుగా నిలవడం సంతోషకరమన్నారు. చెరువుల అభివృద్ధికి తన వంతు సహకారం ఉంటుందన్నారు. నాయకులు రమణారెడ్డి, సుకుమార్, దామోదర్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, చిన్నరెడ్డెప్పరెడ్డి, వెంకటచరణ్ రెడ్డి, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగులకు శిక్షణా తరగతులు



మాట్లాడుతున్న ఎంపీడీవో నారాయణ

సోమల, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా పేదరిక నిర్మూలన, ఆరోగ్యకరమైన గ్రామాలుగా, నీటి సమృద్ధి, పరిశుభ్రతలపై ఎంపీడీవో నారాయణ అవగాహన కల్పించారు. శిక్షణా తరగతుల్లో ఈవోపీఆర్డీ లక్ష్మీదేవి, సర్పంచులు సురేంద్రరెడ్డి, బాలసుబ్రమణ్యం, జయరాం, మసూద్‌బాషా, వెంకటరమణ, రాజేశ్వరి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు. **చౌడేపల్లె:** ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులకు,సిబ్బందికి సుస్థిర అభివృద్ధిపై శిక్షణ నిర్వహించారు. ఎంపీడీవో లీలామాధవి,ఈవోపీఆర్డీ కృష్ణవేణి, రమాదేవి పాల్గొన్నారు.

## మినీ గోకులాల నిర్మాణంలో జాప్యం తగదు



గోకులాలను పరిశీలిస్తున్న ఏపీడీ శ్రీనివాసులు

సోమల, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పాడిరైతులకు చేయూతగా ఉండేందుకు మంజూరు చేసిన గోకులాల నిర్మాణం వేగవంతం చేయాలని ఏపీడీ శ్రీనివాసులు సూచించారు. సోమవారం సోమలలో గోకులాల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. మండలానికి మంజూరైన గోకులాల పనుల వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పాడి రైతులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఏపీవో దికకర్‌బాబు, శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

## ప్రతి పల్లెలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి:డీఎస్పీ



డీఎస్పీ ప్రభాకర్

సదుం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఒక సీసీ కెమెరా 50 మంది పోలీసుల నిఘాతో సమానమని డీఎస్పీ ప్రభాకర్ పేర్కొన్నారు. సదుం పోలీసు స్టేషన్‌ను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పోలీసూ తనకు కేటాయించిన పల్లెలో రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలను చైతన్యవంతుల్ని చేయాలన్నారు. వాహనచోదకులు హెల్మెట్ ధరించాలని సూచించారు. చౌడేపల్లె రూరల్ సీఐ రాంభూపాల్, ఎస్‌ఐ షేక్‌షావలి పాల్గొన్నారు.

## విద్యుత్ ఆదాపై అవగాహనా ర్యాలీ



పుంగనూరు రూరల్, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఆదాపై ప్రజలకు అవగాహన కల్పించాలని తమ సిబ్బందిని విద్యుత్‌శాఖ ఈఈ శ్రీనివాసమూర్తి కోరారు. ఇందన పొదుపు వారోత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన ర్యాలీలో అధికారులు, సిబ్బందితో కలసి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క యూనిట్ విద్యుత్ ఆదా చేస్తే రెండు యూనిట్ల ఉత్పత్తితో సమానమన్నారు. కార్యక్రమంలో ఏడీఈ శ్రీనివాసులు, ఏఈలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆక్రమణదారుల నుంచి ఇంటి స్థలాన్ని కాపాడండి



రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు, బీజేపీ నాయకులు

పుంగనూరు రూరల్, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): గతంలో ప్రభుత్వం ఇచ్చిన ఇంటి పట్టాను గ్రామంలో కొంతమంది కలసి కబ్జా చేస్తున్నారని బాధిత కుటుంబసభ్యులు వాపోయారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో బాధిత విమలమ్మ కుటుంబసభ్యులు, బీజేపీ నాయకులు అయూబ్‌ఖాన్, నరసింహులతో కలసి వినతిపత్రం అందజేశారు. బాధితులు మాట్లాడుతూ నెల్లూరుపల్లెకు చెందిన విమలమ్మకు గతంలో ఇంటి పట్టా ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు. కొన్ని కారణాలతో నిర్మించలేకపోయామన్నారు. ప్రస్తుతం ఇల్లు కట్టేందుకు సిద్ధపడుతుంటే గ్రామంలో కొంతమంది అడ్డుపడుతున్నట్లు వాపోయారు.

## కాశీవిశ్వేశ్వరాలయంలో వైభవంగా ధనుర్మాస పూజలు

రామకుప్పం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం ప్రారంభం సందర్భంగా రామకుప్పంలోని కాశీవిశ్వేశ్వరాలయంలో సోమవారం ధనుర్మాస పూజలు వైభవంగా జరిగాయి. తెల్లవారుజామున అలయ అర్చకులు కృష్ణమూర్తి, హరీకుమార్‌లు స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. విశేష అలంకరణలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో ఆలయంకు చేరుకుని అమ్మవారిని, స్వామివారిని దర్శనం చేసుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నప్రాదాలను పంపిణీ చేశారు.

## శబరిమలైకి భక్తుల పాదయాత్ర



బైరెడ్డిపల్లె, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె నుంచి శబరిమలైకు బయలుదేరిన దాదాపు వందమంది అయ్యప్ప భక్తుల పాదయాత్ర సోమవారం బైరెడ్డిపల్లెకు చేరుకుంది. ఈనెల 14న వీరు బయలుదేరారు. గత 26 సంవత్సరాలుగా తాము శబరిమలై కొండకు పాదయాత్రగా వెళుతున్నట్లు భక్తులు చెప్పారు. ఈనెల 31వతేదిలోపు శబరిమలై చేరుకుంటామన్నారు. బైరెడ్డిపల్లెలోని అయ్యప్పస్వామి ఆలయంవద్ద కొంతసేపు విశ్రాంతి తీసుకున్న వీరు పాదయాత్రను వి.కోట మీదుగా కొనసాగించారు.

# పలమనేరు
# కుప్పం/పుంగనూరు

## 22న దివ్యాంగులకు శిబిరం

పలమనేరు, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి) : స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 22న దివ్యాంగులకు ప్రత్యేక సహాయ పరికరాల గుర్తింపు శిబిరం నిర్వహిస్తున్నారని ఎంఈఓ లీలారాణి తెలిపారు. సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వశాఖ సౌజన్యంతో కృత్రిమ అవయవాల తయారీ సంస్థ దీనిని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దివ్యాంగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు


## నేడు,రేపు క్రీడాపోటీలు

పలమనేరు, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి) : స్థానిక మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 17,18 తేదీల్లో ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్సు అండ్ గేమ్స్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మొహమ్మద్‌తెలిపారు. 12 కళాశాలల విద్యార్థులు పాల్గొంటారన్నారు. వాలీబాల్, ఖోఖో, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్,చెస్, పరుగు, హైజంప్, లాంగ్‌జంప్, ట్రిపుల్‌జంప్, షాట్‌పుట్, డి స్కస్‌త్రో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో విజేతలు జనవరిలో విశాఖలో జరిగే స్టేట్‌మీట్ లో పాల్గొంటారన్నారు. పోటీలకు ముఖ్య అతిథిగా సాంకేతిక విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ నిర్మల్‌కుమార్‌ప్రియ పాల్గొంటారని వివరించారు.

## నెలాఖరు వరకూ పంట బీమా గడువు పెంపు

రొంపిచెర్ల, డిశంబరు 16(ఆంధ్రజ్యోతి) ప్రభుత్వం పంట బీమా పథకం గడువు ఈ నెలాఖరు వరకు పొడిగించినట్లు మండల ఏఈవో సుబ్రమణ్యం తెలిపారు. ఆయన సోమవారం రైతులతో మాట్లాడుతూ వరి ఎకరానికి రూ.84, వేరుశనగకు రూ.60, టమోటాకు రూ.500,మామిడికి రూ.1750 ప్రీమియం చెల్లించాలన్నారు. ఈనెల 31 లోగా బీమా చేసుకోవాలన్నారు.

## నేడు ఏకలవ్య కాలనీ పుస్తకావిష్కరణ




పలమనేరు, డిసెంబరు16 :తాను రచించిన ఏకలవ్య కాలనీ ఎరుకల జీవనగాథలు పుస్తకాన్ని ఈనెల 17న హైదరాబాద్‌లో ఆవిష్కరించనున్నట్లు రచయిత పలమనేరు బాలాజీ ఓ ప్రకటనలో తెలిపారు. యువక్రీడాకారుడు రాగాల వెంకటరాహుల్, సాహితీవేత్త ఎస్. వేణుగోపాల్ ఈ కథాసంపుటిని ఆవిష్కరించి తొలి ప్రతిని ప్రముఖ కవి కె.శివారెడ్డికి అందజేస్తారన్నారు. ఆదివాసీ ఎరుకల జీవితాలను కథాసంపుటిగా మొదటిసారి తీసుకువస్తున్నట్లు వివరించారు.

## భోగనంజుండేశ్వరస్వామి ఆలయ భూముల సర్వే



పుంగనూరు రూరల్, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున భోగనంజుండేశ్వరస్వామి ఆలయ భూములను రెవెన్యూ, మున్సిపల్, దేవదాయశాఖ అధికారులు సోమవారం సంయుక్తంగా సర్వే చేశారు. ఆలయ భుములను పట్టణంలోని కొందరు నాయకులు ఆక్రమించుకోవడంతో దేవదాయ శాఖ కోర్టును ఆశ్రయించింది. ఈనేపథ్యంలో కోర్టు ఆదేశాల మేరకు సర్వే నిర్వహించి నివేదికను కోర్టుకు సమర్పించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈవో కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పీర్ల మాన్యం భూముల పరిశీలన

రొంపిచెర్ల,డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బండకిందపల్లె పంచాయతీలో పీర్ల చావడి మాన్యం భూములు పరిశీలించి న్యాయం చేస్తానని మండల తహసిల్దార్ కిరణ్‌కుమార్ చెప్పారు. ఆయన సోమవారం రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తుల పరిశీలనకు బండకిందపల్లెకు వచ్చారు. ఈసందర్భంగా చావడి మాన్యం భూముల గురించి ముస్లిం పెద్దలతో సంప్రదించారు. రికార్డుల ఆధారంగా న్యాయం చేస్తామన్నారు. ఫ్రీహోల్డ్ భూముల డాక్యుమెంట్స్ ఇవ్వాలని రైతులకు సూచించారు. ఆన్‌లైన్ సమస్యలు విచారించారు. ఆర్‌ఐ సుధాకర్, గ్రామసర్వేయర్ మానస, వీఆర్‌ఏ ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం స్వాధీనం: ఒకరి అరెస్టు

వెదురుకుప్పం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మద్యం సీసాలుసహా ఒకరిని అరెస్టు చేసినట్లు కార్వేటినగరం ఎస్‌ఐ రాజ్‌కుమార్ తెలిపారు. కార్వేటినగరం మండలం అమ్మపల్లె క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం రాత్రి ఓ వ్యక్తి నుంచి 35క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, అతడిని అరెస్టు చేశారు. అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

## కొటాలలో వైద్య శిబిరం

యాదమరి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని యాదమరి పీహెచ్‌సీ వైద్యుడు అనిల్‌కుమార్ నాయక్ సూచించారు. సోమవారం కొటాల గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించారు. సీహెచ్‌వో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రతి నెలా గర్భిణులకు పరీక్షలు చేసి.. మందులు అందిస్తామన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ దివ్యశ్రీ, శైలజ, మీరా, కళ పాల్గొన్నారు.



# రెవెన్యూ సదస్సులున్నా పోటెత్తుతున్న అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్నఆర్డీఓ భవాని

పలమనేరు, డిసెంబరు16 : భూసమస్యల పరిష్కారం కోసం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నా ప్రజలు ఇక్కడి ఆర్డీఓ కార్యాలయానికి వస్తున్నారు. మండలాల్లో తహసీల్దార్ స్థాయి అధికారులకు అర్జీలు ఇచ్చినా పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ఆర్డీవో భవానీకి పలుమండలాల వారు అర్జీలు సమర్పించారు. మదనపల్లి ఆర్డీవో కోర్టులో కేసులపై తమకు సమాచారం అందలేదని కొందరు రైతులు పలమనేరు ఆర్డీవోను కలుస్తున్నారు. దీంతో వారంలో వీలునుబట్టి ఒకటినుంచి రెండురోజులు కోర్టు నడిపిస్తామని బాధితులకు హామీ ఇస్తున్నారు. ఆర్డీవో భవాని మాట్లాడుతూ రెవెన్యూసదస్సులకు ఇప్పటివరకు మండలాల వారీగా పెద్దపంజాణి 328, బైరెడ్డిపల్లి 301, సోమల 229, గంగవరం 191, చౌడేపల్లి 148, పుంగనూరు 135, సదుం 113, బంగారుపాళ్యం 109, పలమనేరు 92, వి.కోట 90 అర్జీలు వచ్చాయన్నారు. వీటిని త్వరగా పరిష్కరిస్తామని ఆమె వివరించారు.

### రెండేళ్లుగా తిరుగుతున్నాను



నాకున్న 33 సెంట్ల భూమి వివాదంపై మదనపల్లి ఆర్డీవో కోర్టులో 2014 కేసు వేశారు. దశాబ్దకాలంగా పరిష్కారానికి కాలేదు. పలమనేరు రెవెన్యూ డివిజన్ ఏర్పడ్డాక రెండేళ్లుగా అర్జీలు ఇస్తున్నాను. వాయిదా నోటీసులు కూడా ఇంతవరకూ అందడంలేదు.

-రామక్రిష్ణారెడ్డి,పొదలకుంట్లవారిపల్లి

### ఎవరూ పట్టించుకోవడంలేదు



నాకు 60 సెంట్ల పొలముంది. సరిహద్దురాళ్లను పక్కభూమి రైతు తొలగించి దౌర్జన్యానికి పాల్పడుతున్నాడు. తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేయమన్నారు. పోలీసులకు చెబితే ఇది రెవెన్యూ సమస్య అంటున్నారు. సమస్య పరిష్కరించడంలేదు.

-గంపల రెడ్డెప్ప,శ్రీరంగరాజపురం

### ఇంటిస్థలానికి రక్షణ కల్పించాలి



మా ఇంటి స్థలాన్ని ఓ దళిత నాయకుడు కొంతమందితో వచ్చి ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. గ్రామ కంఠంలో సర్వేనంబరు 11-2బిలో 2.5 సెంట్లు ఉంది. దీనిని ఓ వ్యక్తి ఆక్రమించుకొనేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలి.

-బి.లక్ష్మీదేవి,నల్లూరివల్లి

### నాపేరిట నమోదు చేయాలి



గంద్రాజుపల్లి మజరాలో 9 సెంట్లు భూమిని కొని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాను. ఈ భూమిని వీఆర్ఓ,సర్వేయర్ మరొకరి పేరున ఆన్‌లైన్‌లో నమోదుచేశారు. భూమి నా పేరుమీద మార్చాలని కోరుతున్నాను

-ఎస్.బాబు,మార్లపల్లి

## వేగంగా భూసేకరణ పనులు: ఎమ్మెల్యే అమర్



అధికారులతో మాట్లాడుతున్న అమరనాథరెడ్డి

పలమనేరు, డిసెంబరు16 : పెద్దచెరువు ఆయకట్టులో ఎస్‌టీపీ (మురుగు నీటి శుద్ధి కేంద్రం) కోసం భూసేకరణ పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి తహసీల్దార్ ఇన్బనాథన్, మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డిలను ఆదేశించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అభ్యంతరాలు చెబుతున్న వారితో ఒప్పించి భూమిని సేకరించాలన్నారు. గడ్డూరు కాలనీలో మౌళిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. గంగన్న శిరస్సు ప్రాజెక్టు పనులు ప్రారంభించాల్సి ఉందన్నారు.

## ఇక ప్రతి సోమవారమూ వినతుల దినం



మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసరావు,తదితరులు

కుప్పం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇక ప్రతి సోమవారం వినతుల దినంగా ప్రభుత్వం మార్చినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం సచివాలయాల సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ప్రతి సోమవారాన్నీ గోల్డెన్ డేగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఆరోజున ప్రభుత్వ కార్యాలయాల్లో గ్రీవెన్స్ స్వీకరించాలన్నారు. అర్జీదారుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. మున్సిపాలిటీ పరిధిలో జూన్ నుంచి ఇప్పటివరకూ అందిన పెన్షన్లు, రేషన్ కార్డులు, హౌసింగ్ అర్జీలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన, కడా పీడీ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక, మున్సిపల్ కార్యాలయాలకు అందిన 2591 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. టీడీపీ మున్సిపల్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ జిమ్ దాము, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## సచివాలయ సిబ్బంది కోసం పడిగాపులు

### సమయానికి రాకుంటే చర్యలు: కమిషనర్



సిబ్బంది కోసం ప్రజల నిరీక్షణ

పుంగనూరు, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది సకాలంలో విధులకు హాజరుకాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం తేరువీధిలోని 1,2,3 సచివాలయాల్లో ఉదయం 11 గంటలకు కూడా సిబ్బంది హాజరుకాలేదు. 11.3గంటలకు ఇద్దరు మహిళా పోలీసులు, వీఆర్వో, ముగ్గురు డిజిటల్ అసిస్టెంట్లు హాజరయ్యారు. సిబ్బంది కోసం పడిగాపులు కాశారు. ముఖ్యంగా ఆధార్ మార్పులు, చేర్పులకు వచ్చిన వారికి ఇబ్బందిపడ్డారు. భగత్‌సింగ్ కాలనీ సచివాలయంలో ఐరీస్ యంత్రం మరమ్మతులకు గురైంది. ప్రైవేటు బస్టాండ్‌లోని సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ సెలవులో వెళ్లారు. తేరువీధిలో మాత్రమే ఆధార్ సేవలున్నాయి. సిబ్బంది సక్రమంగా విధులకు రావడం లేదని విమర్శలు ఉన్నాయి. మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డిని విచారించగా విధులకు సక్రమంగా హాజరు కాని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

## వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

పుంగనూరు రూరల్, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. పుంగనూరు-ముళబాగల్ మార్గంలోని రాజుపల్లె వద్ద ద్విచక్రవాహనం బోల్తాపడటంతో కొండసముద్రంకు చెందిన రవి తీవ్రంగా గాయపడ్డాడు. పెద్దపంజాణిలో వెంకటరమణ అనే వ్యక్తి సోమవారం రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన వెంకటరమణను పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరో ప్రమాదంలో పెద్దపంజాణి మండలం బట్టందొడ్డికి చెందిన షావలి గాయపడ్డాడు. మద్యం తాగి ద్విచక్ర వాహనం నడుపుతూ ప్రమాదానికి గురయ్యాడు. గాయపడిన షావలీని చికిత్స పొందుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

## ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ అధికారికి నివాళులు



కుప్పస్వామినాయక్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో అటవీ డిప్యూటీ రేంజ్ అధికారిగా పనిచేస్తూ అనారోగ్యంతో మృతిచెందిన కుప్పస్వామినాయక్‌కు అధికారులు, నాయకులు నివాళులర్పించారు. రామకుప్పం మండలం పీఎంకేతాండాకు చెందిన ఆదివారం మృతి చెందిన నాయక్ ప్రభుత్వ ఉద్యోగంలో చేరకముందు తెలుగునాడు ట్రేడ్ యూనియన్ మండల అధ్యక్షుడిగా పనిచేశారు. సోమవారం ఆయన మృతదేహాన్ని టీడీపీ నేతలు ఆనందరెడ్డి, చిన్నికృష్ణ, కృష్ణానాయక్, విశ్వనాథ్ తదితరులు సందర్శించి నివాళులర్పించారు. డీఎఫ్‌ఓ భరణి, సబ్‌డీఎఫ్‌ఓ వేణుగోపాల్, రేంజ్ అధికారులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

## కార్వేటినగరంలో గంగ జాతర సందడి



వివిధ రకాల వేషాల్లో చిన్నారులు

వెదురుకుప్పం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం గంగజాతరకు చాటింపు జరిగిన నేపథ్యంలో కొందరు సోమవారం వేషాలు ధరించి పురవీధుల్లో సందడి చేశారు. అమ్మవారికి భక్తులు సారె సమర్పించారు. మంగళ, బుధవారాల్లో జరిగే కార్వేటినగరం గంగ జాతరకు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, ఎస్‌ఐ రాజ్‌కుమార్ సోమవారం తెలిపారు. ముగ్గురు సీఐలు, ఏడుగురు ఎస్‌ఐలతోపాటు వంద మంది సిబ్బంది విధుల్లో ఉంటారన్నారు. డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షిస్తూ ప్యాకెల సాయంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూసుకుంటామని చెప్పారు. బంగారమ్మ ఆలయ కమిటీతో సమావేశమై జాతర సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏర్పాట్లపై పలు సూచనలు ఇచ్చారు.

## సౌత్‌జోన్ ఫుట్‌బాల్ జట్టుకు హుజైఫా ఎంపిక



హుజైఫాతో నవీన్‌కుమార్

పలమనేరు, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి) : సౌత్‌జోన్ ఫుట్‌బాల్ జట్టుకు పలమనేరుకు చెందిన క్రీడాకారుడు ఎంపికయ్యాడని స్థానిక ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు నవీన్‌కుమార్ తెలిపారు. నవీన్‌తోపాటు కార్యదర్శి దిలీప్, ప్రభుత్వ డిగ్రీకళాశాల ఫిజికల్ డైరెక్టర్ విక్రమ్‌రాజ్ సోమవారం మాట్లాడుతూ కుప్పం యూనివర్సిటీలో జరిగిన సౌత్‌జోన్ ఎంపిక పోటీల్లో హుజైఫా ఉత్తమ ప్రతిభ కనబరచి ఎంపికయ్యాడన్నారు. జేఎన్‌టీయూఏ ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికైనవారికి ఈనెల 19వరకు కోచింగ్ క్యాంపు నిర్వహిస్తారన్నారు. అసోసియేషన్ సభ్యులు యువరాజ్, సూర్యప్రకాష్, మన్సూర్, మురళి, గోపాల్, కిరణ్, జాకీర్, సాగర్ హుజైఫాను అభినందించారు.

## కాశీ విశ్వేశ్వరుడికి పూజలు

కల్లూరు, డిసెంబరు 16 ( ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం దేవళంపేటలో కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో సోమవారం విశేషపూజలు నిర్వహించారు. మార్గశిరమాసం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా వేకువజాము నుంచే పూజలు ప్రారంభించారు. మహాగణపతి, సుబ్రమణ్యంస్వామి, కాశీవిశాలాక్షి అమ్మవారు, కాశీ విశ్వేశ్వరస్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. మహాఅలంకారం, మహాప్రసాదం, మహామంగళహారతి నిర్వహించారు. పూజలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

**పుంగనూరు రూరల్:** పట్టణంలోని కోనేటి వద్ద కాశీవిశ్వేశ్వరస్వామి సోమవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆరుద్ర నక్షత్రం సందర్భంగా అర్చకులు ఉదయాన్నే ఆలయాన్ని శుద్ధి చేసి రుద్రాభిషేకం చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు ఉపవాసాలతో స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

## ఎంఈవో ఆకస్మిక తనిఖీ



విద్యార్థినితో మాట్లాడుతున్న ఎంఈవో

కుప్పం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అడవిబూదుగూరు హరిజనవాడ మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలను ఎంఈవో-2 సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు రాస్తున్న ఈవీఎస్ పరీక్షను పరిశీలించారు. ఉపాధ్యాయుల పనితీరును కూడా పరిశీలించి సూచనలిచ్చారు. ప్రధానోపాధ్యాయుడు పోతుగుంట చిట్టిబాబు, ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడారు. .

## చెరువు కాలువ కబ్జా

ఐరాల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వీఎస్ అగ్రహారం చెరువు కాలువ కబ్జాకు గురైందని ఫైలారు వేణుగోపాల్ సోమవారం తహసీల్దార్ మహేష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. నాగమవాండ్లపల్లె పంచాయతీ వీఎస్ అగ్రహారంలో సర్వే నెంబరు 18/3 తనకు కొంత భూమి ఉందన్నారు. ఈ భూమిలో తాను ఇటీవల ఇంటిని నిర్మించుకున్నట్లు తెలియజేశారు. ఇంటి పక్కన తనకు కొంత స్థలం ఉందన్నారు. ఆ భూమిని ఆనుకుని 18/8, 18/16 సర్వే నెంబర్లలో నగరి ఉమాశంకర్, అరుణల స్థలం ఉందన్నారు. ఇద్దరి స్థలంలో చెరువు కాలువ హద్దుగా ఉందన్నారు. వారు ఆ కాలువను పూడ్చివేసి.. తన భూమిని కూడా ఆక్రమించి ప్రహరీ నిర్మించారని పేర్కొన్నారు.

## రేపు విభిన్న ప్రతిభావంతులు,వృద్ధులకు ప్రత్యేక శిబిరం



శిబిరం స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీనివాసులు, శ్రీదేవి తదితరులు

శ్రీరంగరాజపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులు, వృద్ధులకు ప్రత్యేక శిబిరం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో శ్రీనివాసులు తెలిపారు. ఎస్ఆర్‌పురం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు స్థలాన్ని సోమవారం డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవితో కలసి పరిశీలించారు. అర్హులైన వారికి చేతి, చంక కర్రలు, వీల్‌ఛైర్, వినికిడి యంత్రం, బ్యాటరీ సైకిల్, కృత్రిమ అవయవాల అందించడం జరుగుతుందన్నారు. వచ్చేవారు రేషన్, ఆధార్ కార్డులతోపాటు సదరం సర్టిఫికెట్, రెండుసెట్ల జిరాక్స్ కాపీలు తేవాలని సూచించారు. తహసీల్దార్ లోకనాథం పిళ్లై, ఎంపీడీవో మోహన మురళి, తదితరులు పాల్గొన్నారు.

# రేపు విభిన్న ప్రతిభావంతులు, వృద్ధులకు శిబిరం



ఎస్ఆర్‌పురంలో శిబిరం ఏర్పాటు చేసే స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీనివాసులు, డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి తదితరులు

శ్రీరంగరాజపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులు, వృద్ధులకు ప్రత్యేక శిబిరం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో శ్రీనివాసులు తెలిపారు. ఎస్ఆర్‌పురం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు స్థలాన్ని సోమవారం డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవితో కలసి పరిశీలించారు. అర్హులైన వారికి చేతి, చంక కర్రలు, వీల్‌ఛైర్, వినికిడి యంత్రం, బ్యాటరీ సైకిల్, కృత్రిమ అవయవాల అందించడం జరుగుతుందన్నారు. వచ్చేవారు రేషన్, ఆధార్ కార్డులతోపాటు సదరం సర్టిఫికెట్, రెండుసెట్ల జిరాక్స్ కాపీలు తేవాలని సూచించారు. తహసీల్దార్ లోకనాథం పిళ్లై, ఎంపీడీవో మోహన మురళి, తదితరులు పాల్గొన్నారు.

# చెరువులుగా మారుతున్న పంట పొలాలు

● రైతుల ఆవేదన



పన్నూరు సబ్‌స్టేషన్ వద్ద మోటారు షెడ్డులో నిలిచిన వర్షపునీరు

విజయపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు-తచ్చూరు హైవే నిర్మాణంతో మండలంలో కొన్ని ఎకరాల పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హైవే నిర్మించక ముందు ఎంత వర్షం కురిసినా, వరద నీరు ఎంతొచ్చినా పంట పొలాల మీదుగా వెళ్లిపోయేదని తెలిపారు. ప్రస్తుతం పొలాల మధ్యలో రోడ్డు వచ్చిందన్నారు. దీనివల్ల నీరు పొలాల్లోనే నిలిచి పోతోందని రైతులు తలలు పట్టుకుంటున్నారు. వర్షం తగ్గి నాలుగైదు రోజులవుతున్నా ఇంతవరకు పొలాల్లో నీరు తగ్గడం లేదని, మోటారు షెడ్డు సైతం నీటిలో ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గొల్లకండ్రిగ నుండి సామిరెడ్డి కండ్రిగ వరకు లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు వెళ్లడానికి వంతెనలు సక్రమంగా నిర్మించకపోవడంతోనే సమస్యలు ఎదురవుతున్నాయని కంట తడి పెడుతున్నారు. ప్రతి ఏడాది ఇలాగే పంటలు నీట మునిగితే ఎవరికి చెప్పుకోవాలంటూ వాపోతున్నారు. ఇక సామిరెడ్డి కండ్రిగ వద్ద వర్షం పడిన ప్రతిసారి రోడ్డు దాటడానికి కూడా వీలు కావడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు.



గొల్లకండ్రిగ వద్ద చెరువును తలపిస్తున్న పంట పొలాలు

# కూలిన పాఠశాల ప్రహరీని పరిశీలించిన ఏపీవో



కూలిపోయిన ప్రహరీని పరిశీలిస్తున్న వెంకటరమణారెడ్డి

పాలసముద్రం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వెంగళరాజుకుప్పం ప్రాథమిక పాఠశాల ప్రహరీ ఇటీవల కురిసిన వర్షాలకు కూలిపోయింది. ఇది కూలిన చోట వ్యవసాయ బావి ఉండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు భయపడుతున్నారు. ఈ విషయాన్ని ఎంఈవో రాజేంద్రప్రసాద్‌తోపాటు జిల్లా ఉన్నతాధికారులకు ఉపాధ్యాయులు తెలియజేశారు. దీంతో సోమవారం ఎస్ఎస్ ఏపీవో వెంకటరమణారెడ్డి వచ్చి కూలిన ప్రహరీని పరిశీలించారు. ఈ విషయాన్ని కలెక్టర్‌కు తెలియజేసి నిధులు మంజూరు చేయిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అరుణకుమారి, ఎంపీడీవో కృష్ణమహేష్‌రెడ్డి, ఎంఈవో-2 గిరిజ, హెచ్‌ఎం జాన్‌విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

# కరాటే క్రీడాకారులకు అభినందన



విద్యార్థికి ప్రశంసాపత్రం పంపిణీ చేస్తున్న సీఐ మహేశ్వర్

నగరి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కరాటే పోటీల్లో ప్రతిభ చూపిన వారిని పలువురు అభినందించారు. స్థానిక ఆర్కే స్పోర్ట్స్ అకాడమీలో సోమవారం జరిగిన కార్యక్రమంలో క్రీడాకారులకు వివిధరకాల బెల్టులను నగరి సీఐ మహేశ్వర్ ప్రదానం చేశారు. 35 మందికి ఎల్లో బెల్టులు, 25 మందికి ఆరెంజ్ బెల్టులు, 12మందికి బ్లూ బెల్టులు, 18మందికి గ్రీన్‌బెల్టులు, ఏడుగురికి బ్రౌన్ బెల్టులు, 9 మందికి బ్లాక్ బెల్టులు, ప్రశంసాపత్రాలు పంపిణీ చేశారు. కరాటే మాస్టర్లు రాజ్‌కోటి, లాచి పాల్గొన్నారు.

# ఈ రోడ్డుకు మరమ్మతులు చేయరూ?



రంగారెడ్డి వీధిలో పలుచోట్ల గుంతలు పడిన రోడ్డు

చిత్తూరు రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మిట్టూరు రంగారెడ్డి వీధిలోని రోడ్డు గుంతలు పడి ప్రమాదకరంగా మారాయి. ఇక్కడ సుమారు వందకుపైగా కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. రోజు వందలాది మంది ఈ రోడ్డుపై ప్రయాణిస్తుంటారు. ఎప్పుడో ఈ వీధి ఏర్పడినప్పుడు వేసిన రోడ్డు కావడంతో పెద్దపెద్ద గుంతలు ఏర్పడింది. రాత్రిపూట ఈ గుంతల్లోపడి వాహనదారులు గాయపడుతున్నారు. 500 మీటర్ల ఉన్న ఈ రోడ్డులో 400 మీటర్ల వరకు మరమ్మతులకు గురైందంటేనే పరిస్థితి అర్థం చేసుకోవచ్చని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

# బాపూజీనగర్‌లో వరాహాల స్వైర విహారం



చిత్తూరు అర్బన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బాపూజీనగర్‌లో వరాహాలు స్వైర విహారం చేస్తున్నాయి. నగరపాలక అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఇవి గుంపులు.. గుంపులుగా ఇళ్లలోకి చొరబడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏడో డివిజన్ పరిధిలో బాపూజీ నగర్‌ను ఆనుకుని పంట పొలాలు ఉన్నాయి. కట్టమంచి బ్రిడ్జి కింద అనధికారికంగా పందులను కొందరు మేపుతున్నారు. శివారు ప్రాంతాల్లో కూడా కొంతమంది నగరంలోని హోటళ్ల నుంచి వ్యర్థాలను తీసుకొచ్చి వాటికి వేస్తున్నారు. పగటిపూట బయటకు వదిలేయడంతో అవి వీధుల్లో తిరుగుతున్నాయి. ముఖ్యంగా బాపూజీనగర్‌లోని ఏ వీధిలో చూసినా వీటి సంచారమే కనిపిస్తుంది. ఎవరూ లేని సమయంలో ఇళ్లలోకి చొరబడుతున్నాయి. వీటిని చూసి విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. వర్షాకాలం కావడంతో వీటివల్ల అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా నగరపాలక ప్రజారోగ్య అధికారులు స్పందించి వీధుల్లో పందులు తిరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## వీఎస్ అగ్రహారం చెరువు కాలువ కబ్జా

● తహసీల్దార్‌కు ఫిర్యాదు

ఐరాల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వీఎస్ అగ్రహారం చెరువు కాలువ కబ్జాకు గురైందని మైలారు వేణుగోపాల్ సోమవారం తహసీల్దార్ మహేష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. నాగమవాండ్లపల్లె పంచాయతీ వీఎస్ అగ్రహారంలో సర్వే నెంబరు 18/3 తనకు కొంత భూమి ఉందన్నారు. ఈ భూమిలో తాను ఇటీవల ఇంటిని నిర్మించుకున్నట్లు తెలియజేశారు. ఇంటి పక్కన తనకు కొంత స్థలం ఉందన్నారు. ఆ భూమిని ఆనుకుని 18/8, 18/16 సర్వే నెంబర్లలో నగరి ఉమాశంకర్, అరుణల స్థలం ఉందన్నారు. ఇద్దరి స్థలంలో చెరువు కాలువ హద్దుగా ఉందన్నారు. వారు ఆ కాలువను పూడ్చివేసి.. తన సొంత భూమిని కూడా ఆక్రమించి ప్రహరీ నిర్మించారని, విచారించి న్యాయం చేయాలని కోరారు. కాగా, పీజీఆర్ఎస్‌కు నాలుగు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు.

## చెరువులను కాపాడండి: టీడీపీ

గుడిపాల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొన్ని చెరువులు ఆక్రమణలకు గురయ్యాయని, వాటిని సర్వే చేసి కాపాడాలని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, సీనియర్ నేత గురజాల చెన్నకేశవులు నాయుడు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. పూర్తి స్థాయిలో సర్వే చేయించి నెంబర్ రాళ్లను నాటి.. హెచ్చరికలు జారీ చేయాలని కోరారు.

# ఈ భవనాలకు మోక్షమెప్పుడో?

## అసౌకర్యాల నడుమ సచివాలయ ఉద్యోగులు

పెనుమూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు మండలంలో 25 గ్రామ పంచాయతీలకు సంబంధించి గత వైసీపీ ప్రభుత్వం 14 సచివాలయాలు ఏర్పాటు చేసింది. అన్నింటికీ కొత్త భవనాలు నిర్మిస్తామని చెప్పింది. కొన్ని భవనాలే నిర్మించింది. వాటినీ ప్రారంభించలేదు.




ఇది రామకృష్ణాపురం పంచాయతీలో నిర్మించిన సచివాలయ భవనం. ఇది పూర్తయ్యి ఎనిమిది నెలలు అవుతున్నా ఇంతవరకు ప్రారంభానికి నోచుకోలేదు. సిబ్బంది పాత పంచాయతీ భవనంలోనే అసౌకర్యాల నడుమ విధులు నిర్వహిస్తున్నారు.



ఇది పులికల్లు సచివాలయ భవనం. ఈ భవనంలో టాయిలెట్లు, ఎలక్ట్రికల్ పనులు పెండింగ్‌లో ఉండటంతో పంచాయతీ భవనంలో సచివాలయం నడుపుతున్నారు. బిల్లులు కూడా పెండింగ్‌లో ఉన్నాయని కాంట్రాక్టర్ తెలిపారు.




ఇది సాతంబాకంలో నిర్మించిన సచివాలయ భవనం. ఇదీ ప్రారంభం కాలేదు. ఈ భవన నిర్మాణానికి స్థలం ఇచ్చిన దాత అడ్డుకుంటున్నారని సమాచారం. సచివాలయానికి స్థలం ఇస్తే బదులుగా వేరేచోట రెండెకరాలు కేటాయిస్తామని చెప్పి ఆయనకు ఇవ్వక పోవడమే కారణమని తెలిసింది.

# కార్వేటినగరంలో గంగ జాతర సందడి



వివిధ రకాల వేషాల్లో చిన్నారులు

వెదురుకుప్పం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలో గంగజాతరకు చాటింపు జరిగిన నేపథ్యంలో కొందరు సోమవారం వేషాలు ధరించి పురవీధుల్లో సందడి చేశారు. అమ్మవారికి భక్తులు సారె సమర్పించారు.

**భారీ బందోబస్తు ఏర్పాట్లు**

మంగళ, బుధవారాల్లో జరిగే కార్వేటినగరం గంగ జాతరకు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, ఎస్ఐ రాజ్‌కుమార్ సోమవారం తెలిపారు. ముగ్గురు సీఐలు, ఏడుగురు ఎస్ఐలతో పాటు వంద మంది సిబ్బంది విధుల్లో ఉంటారన్నారు. డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షిస్తూ మ్యాన్ ప్యాక్‌ల సాయంతో ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలగకుండా చూసుకుంటామని చెప్పారు. జాతర ప్రశాంతంగా జరిగేలా ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని కోరారు. అలాగే బంగారమ్మ ఆలయ కమిటీతో సమావేశమై జాతర సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏర్పాట్లపై పలు సూచనలు ఇచ్చారు.

## కార్పొరేషన్‌లో 'పీజీఆర్ఎస్'కు 9 అర్జీలు



బాధితుడితో మాట్లాడుతున్న సహాయ కమిషనర్ ప్రసాద్

చిత్తూరు అర్బన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి తొమ్మిది అర్జీలు అందాయి. బాధితుల నుంచి సహాయ కమిషనర్ ప్రసాద్ వినతిపత్రాలను స్వీకరించారు. ప్రజారోగ్యశాఖకు 3, ఇంజనీరింగ్‌కు 3, టౌన్‌ప్లానింగ్‌కు 2, రెవెన్యూశాఖకు ఒకటి చొప్పున అర్జీలు అందాయన్నారు. ఏసీపీ నాగేంద్ర పాల్గొన్నారు.

## శ్రీరామనామ క్షేత్రంలో ధనుర్మాస పూజలు



జగన్నాథపురంలో భజన చేస్తున్న గ్రామస్తులు

విజయపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జగన్నాథపురం శ్రీరామనామ క్షేత్రంలో ధనుర్మాసం ప్రారంభ సందర్భంగా ఆలయ అర్చకుడు రాంప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో సోమవారం పూజలు నిర్వహించారు. అలాగే ఆలయ ఆవరణంలో శివలింగానికి ప్రత్యేక అభిషేకం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## బీజేపీ పటిష్ఠతకు కృషి : కిసాన్ మోర్చా



ఎన్నికైనవారికి నియామక పత్రాలను అందజేస్తున్న యువరాజు

గంగాధరనెల్లూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయి నుంచి బీజేపీ పటిష్ఠతకు కృషిచేస్తున్నామని కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్, ఎన్నికల పరిశీలకుడు యువరాజు అన్నారు. అగరమంగళం పంచాయతీలో 198, 199 పోలింగ్ బూత్‌లకు అధ్యక్షులుగా ఎంపికైన ఇడగట్టి సుధాకర్, శకుంతలమ్మకు నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ రాజేంద్రన్, మండల కన్వీనర్ మురళి, నేత శరవణకుమార్ పాల్గొన్నారు.

## విద్యుత్ పొదుపుపై వ్యాసరచన పోటీలు

చిత్తూరు రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పీఎన్‌సీ మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు విద్యుత్ పొదుపుపై సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర మాట్లాడారు. 22 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారన్నారు. టౌన్ డీఈ ప్రసాద్, రూరల్ డీఈ ఆనంద్, ఏఈలు పాల్గొన్నారు.

## శాస్త్రోక్తంగా వేల్వి పూజ



వెదురుకుప్పం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కొల్లాగుంట మేల్ మరువత్తూరు ఆది పరాశక్తి సిద్ధుల పీఠం ప్రార్థనా పూజా మందిరంలో సోమవారం రాత్రి శాస్త్రోక్తంగా వేల్వి పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. టి.మణి, టి.మీనాక్షి, టి.మోహన్‌రాజ్, టి.యోగలక్ష్మి కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు. కమిటీ అధ్యక్షులు వీటీ హేమలత, ఎన్.గోవిందరాజులు, ఎం.గోవిందన్, మహేశ్వరి, ఎం.రంగన్, లత, సి.పయణి, జయంతి, కార్యనిర్వాహకులు పాల్గొన్నారు.

## బురదమయంగా గ్రామీణ రోడ్లు

● తీవ్ర ఇబ్బంది పడుతున్న జనం



పాలసముద్రం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తుఫాను కారణంగా కురిసిన వర్షాలకు గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లు బురదమయంగా మారాయి. దీనివల్ల జనం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పోతురాజు గుంట నుంచి టీవీఎన్ఆర్ పురం, సింహరాజుపురం నుంచి అమ్మియార్‌కుప్పం వెళ్లే రోడ్లు బురదతో నిండిపోయాయి. ఇకనైనా రోడ్లను బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

పుంగనూరు రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. పుంగనూరు-ముళబాగల్ మార్గంలోని రాజుపల్లె వద్ద ద్విచక్రవాహనం బోల్తాపడటంతో కొండసముద్రంకు చెందిన రవి తీవ్రంగా గాయపడ్డాడు. పెద్దపంజాణిలో వెంకటరమణ అనే వ్యక్తి సోమవారం రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన వెంకటరమణను పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరో ప్రమాదంలో పెద్దపంజాణి మండలం బట్టందొడ్డికి చెందిన షావలి గాయపడ్డాడు. మద్యం తాగి ద్విచక్ర వాహనం నడుపుతూ ప్రమాదానికి గురయ్యాడు. గాయపడిన షావలీని చికిత్స పొందుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

# బొమ్మసముద్రం పంచాయతీని ఆదర్శంగా తీసుకోండి

● జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు



సమావేశంలో ప్రసంగిస్తున్న రవికుమార్‌నాయుడు



బొమ్మసముద్రం సర్పంచ్ రఘును సన్మానిస్తున్న డీఎల్‌పీవో పార్వతి

చిత్తూరు రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఐరాల మండలంలోని బొమ్మసముద్రం గ్రామ పంచాయతీని ఆదర్శంగా తీసుకోవాలని జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు పిలుపునిచ్చారు. చిత్తూరు ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి స్థానికీకరణ, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై వివిధ శాఖల అధికారులకు రెండ్రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బొమ్మసముద్రంలా అన్ని పంచాయతీలను అభివృద్ధి చేయాలన్నారు. గ్రామాల నుంచి ఇతర ప్రాంతాల్లో బాగా సెటిల్ అయిన వారిని భాగస్వాములుగా చేయాలని సూచించారు. డీపీవో సుధాకర్‌రావు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. పలు మండలాల్లోనూ ఈ కార్యక్రమం జరిగింది.

**ఐరాల:** ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డీఎల్‌పీవో పార్వతి, ఈటీసీ శ్రీకాళహస్తి ప్రిన్సిపాల్ నాగపద్మజ, ఎంపీడీవో ధనలక్ష్మి, ఈవోపీఆర్డీ కుసుమకుమారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి అవార్డు పొందిన బొమ్మసముద్రం సర్పంచ్ రఘును సన్మానించారు.

**పాలసముద్రం:** ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణమహేష్ రెడ్డి, సీహెచ్‌వో జ్ఞానశేఖర్, ఈవోపీఆర్డీ రమేష్ పాల్గొన్నారు.

**యాదమరి:** ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో వేణు, ఏపీవో బాల, ఈవోపీఆర్డీ సుకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

**గుడిపాల:** నరహరిపేట జడ్పీహైస్కూల్ ఆవరణంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో శివరాజు, ఏపీఎం సుధారాణి, కో-ఆర్డినేటర్ సుందరేషన్, ఈవోపీఆర్డీ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

**గంగాధరనెల్లూరు:** హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి, సీహెచ్‌వో శ్రీనివాసులు, పంచాయతీకార్యదర్శులు చంద్ర, శివయ్య పాల్గొన్నారు.

**వెదురుకుప్పం:** కార్వేటినగరం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రమౌళి, సర్పంచులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, డీడీవోలు పాల్గొన్నారు.

**తవణంపల్లె:** ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో డీఎల్‌పీవో పార్వతి, ఎంపీపీ పట్నం ప్రతాప్‌రెడ్డి, ఎంపీడీవో రెడ్డిబాబు పాల్గొన్నారు.

# సంక్షిప్తంగా..

## కృష్ణాపురం జలాశయం గేటు ఎత్తివేత

వెదురుకుప్పం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కృష్ణాపురం రిజర్వాయర్ గేటును సోమవారం రాత్రి ఎత్తి, నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ మేరకు జలవనరులశాఖఏఈ భాస్కరరాజు తెలిపారు.

## కొటాలలో వైద్య శిబిరం



యాదమరి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని యాదమరి పీహెచ్‌సీ వైద్యుడు అనిల్‌కుమార్ నాయక్ సూచించారు. సోమవారం కొటాల గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించారు. సీహెచ్‌వో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రతి నెలా గర్భిణులకు పరీక్షలు చేసి.. మందులు ఉచితంగా అందిస్తామన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ దివ్యశ్రీ, మహిళా ఆరోగ్య కార్యకర్త శైలజ, ఆశా కార్యకర్తలు మీరా, కళ పాల్గొన్నారు.

## మామిడి కవర్ల కోసం పేర్లు నమోదు చేసుకోండి

యాదమరి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మామిడికాయలకు చుట్టడానికి కవర్లు అవసరమైన రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఉద్యాన శాఖ అధికారి సాగరిక సూచించారు. పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌లతో రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించాలన్నారు.

## వావిల్‌తోటలో రెవెన్యూ సదస్సు

పూతలపట్టు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వావిల్‌తోట గ్రామంలో సోమవారం తహసీల్దార్ గుర్రప్ప ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిగింది. పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించడం జరిగింది. డీటీ మహేశ్వరి, టీడీపీ నాయకులు జగన్నాథం, రామ్మూర్తి నాయుడు, మధు, నాదముని, నరసింహులు, అమర్‌నాథ్, గోవర్దన్ పాల్గొన్నారు.

## మద్యం స్వాధీనం: ఒకరి అరెస్టు

వెదురుకుప్పం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మద్యం సీసాలుసహా ఒకరిని అరెస్టు చేసినట్లు కార్వేటినగరం ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు. కార్వేటినగరం మండలం అమ్మపల్లె క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం రాత్రి ఓ వ్యక్తి నుంచి 35క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, అతడిని అరెస్టు చేశారు. అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సోమవారం తెలిపారు.

## టెన్త్‌లో ఉత్తమ ఫలితాలే లక్ష్యం

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా యూటీఎఫ్ వారు మోడల్ పేపర్లు తయారు చేశారని జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్‌నాయుడు తెలిపారు. సోమవారం కాణిపాకం జడ్పీ హైస్కూల్‌లోని 108 మంది విద్యార్థులకు ఈ పేపర్లను పంపిణీ చేశారు. వీటికైన ఖర్చును మండల మాజీ అధ్యక్షుడు సురేష్‌బాబు భరించారన్నారు. నాయకులు సురేంద్రబాబు, శాంతాదేవి, మీనాకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యుత్‌ను పొదుపుగా వాడాలి



సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న సురేష్‌కుమార్

పెనుమూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌ను పొదుపుగా వాడాలని చిత్తూరు రూరల్ ఈఈ సురేష్‌కుమార్ కోరారు. సోమవారం పెనుమూరు విద్యుత్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం పెనుమూరు జడ్పీ హైస్కూల్‌లో విద్యుత్ పొదుపుపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఏఈ తులసిప్రసాద్, జీడీనెల్లూరు ఏడి శేషాద్రిరెడ్డి, హెచ్‌ఎం వెంకటేశులునాయుడు సిబ్బంది పాల్గొన్నారు.